రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం)		సెహరీ (శనివారం ఉదయం)
రాయచోటి	6.31	4.52
మదనపల్లె	6.33	5.00
రాజంపేట	6.29	5.00
పీలేరు	6.31	4.53

వార్షిక రుణాలకు ప్రణాళికలు సిద్ధం చేయండి

● డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ


ఏపీఎంల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

మదనపల్లె టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మహిళా సమాఖ్య గ్రూపు సభ్యులకు 2025-26 ఏడాదికి సంబంధించి అవసరమైన రుణాలను గుర్తించి తదనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక మహిళా సమాఖ్య భవనంలో 13 మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ సభ్యులకు జీవనోపాధి కోసం అవసరమైన రుణాలు ఎంత అవసరం, ఏయే సభ్యులు ఏ వృత్తిలో ఉన్నారు తదితర వివరాలు పరిశీలించాలన్నారు. వారికి ఏ నెలలో ఎంత రుణం అవసరం అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఐదు ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు ఒకటి చొప్పున, మండలం వివరాలను మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. మండలాల ప్లాన్‌ను జిల్లాకు అనుసంధానం చేసి రాష్ట్రానికి పంపుతామన్నారు. ఈ విధానంతో ప్రణాళిక ప్రకారం రుణాలు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్రం నుంచి బ్యాంకర్లకు ఈ వివరాలు పంపి తదనుగుణంగా రుణ మొత్తంను సమీకరిస్తామన్నారు. సమావేశంలో బీపీఎం లక్ష్మీప్రసాద రెడ్డి, ఏపీఎంలు పాల్గొన్నారు

వేలం ద్వారా రూ.54 లక్షల ఆదాయం

కలకడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కలకడ పంచాయతీకి వేలం పాటల ద్వారా రూ.54,03,900 ఆదాయం వచ్చినట్లు మదనపల్లె డీఎల్పీవో నాగరాజు తెలిపారు. దినసరి టమోటా మార్కెట్‌ను నసీబ్‌జాన్ రూ.31.5 లక్షలు, వారపు సంతను శ్రీహరినాయుడు రూ.18.2 లక్షలు, ప్రైవేట్ బస్టాండును సయ్యద్‌సాబ్‌వలి రూ.1.75 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే జంతు వధశాల, రెండు షాపింగ్ గదులకు వేలం నిర్వహించారు. కాగా గత ఏడాది కంటే 11,61,900 అదనపు ఆదాయం పంచాయతీకి దక్కింది. షాపింగ్ రూంలలో ఒకటవ గదికి గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో వాయిదా పడింది. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోఆర్డీ మహ్మద్ రియాజుద్దీన్, సర్పంచ్ ప్యారీజాన్, కార్యదర్శి దేవేంద్ర పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

● అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు


అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

రాజంపేట టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి ఉత్సవాల సందర్భంగా గురువారం సాయంత్రం అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామంలో, అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను అలరింపజేశాయి. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డితో పాటు రాజంపేట చుట్టుపక్కల నుంచి భక్తులు హాజరై భక్తిశ్రద్ధలతో తిలకించారు. అన్నమాచార్య వర్ధంతి ఉత్సవాల ఇన్‌చార్జి టీటీడీ జేఈఈ హేమలత, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, తాళ్లపాక గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు బలి

● నాటు బాంబులు, కరెంట్ తీగలతో జంతువుల వేట

● వన్యప్రాణులతో పాటు ప్రాణాలు కోల్పోతున్న మనుషులు

● పట్టించుకోని అటవీ శాఖాధికారులు

గుర్రంకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువుల కోసం వేటగాళ్లు అమర్చుతున్న విద్యుత్ తీగలు, నాటుబాంబులకు జంతువులతో పాటు మనుషులు కూడా బలవుతున్నారు. అడవిలో మేత దొరకకపోవడంతో వన్యప్రాణులు మేత కోసం పొలాల్లోకి వస్తున్నాయి. దీంతో వాటిని చంపడానికి వేటగాళ్లు మేత వేసి అందులో నాటుబాంబులు అమర్చడం, కరెంటు తీగలు ఏర్పాటు చేస్తుండటంతో ఆ వేటగాళ్ల ఉచ్చుకు వన్యప్రాణులతో పాటు అమాయక ప్రజలు మృతి చెందుతున్నారు.


కిల్లారివాండ్లపల్లె వద్ద కరెంట్ తీగలు తగులుకుని మృతి చెందిన రమేశ్‌నాయుడు (ఫైల్)

● గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దిగువకమ్మపల్లెకు చెందిన రెడ్డెప్పనాయుడు కుమారుడు పి.రమేష్‌నాయుడు (48) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 8వ తేదీ సాయంత్రం కిల్లారవాండ్లపల్లె, దిగువ కమ్మపల్లె మధ్యలో ఉన్న వ్యవసాయ పొలాల్లో వేటగాళ్లు అడవి పందుల కోసం తీసిన కరెంట్ తీగ తగులుకుని మృతి చెందాడు. తన తండ్రి రమేష్‌నాయుడు చావుకు కారణమైన వేటగాళ్లపై చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు తిరుమలనాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● వేటగాళ్లు అడవి పందుల కోసం ఉంచిన నాటుబాంబును ఆవు కొరకడంతో నోటి భాగం ఛిద్రమైన సంఘటన ఈనెల 6వ తేదీ మామిళ్లవారిపల్లెలో జరిగింది. సంగసముద్రం పంచాయతీ మామిళ్లవారిపల్లెకు చెందిన డి.నాగరాజ, రేవతి దంపతులు ఆవులను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆవులను మేత కోసం పొలంలో వదిలారు. ఆవు మేత మేస్తూ వేటగాళ్లు అమర్చిన నాటుబాంబును కొరకడంతో ఆవు నోటి భాగం ఛిద్రమైంది. ఈ సంఘటన జరిగిన నాలుగు రోజులకు వేటగాళ్లు అమర్చిన నాటుబాంబును కుక్క కొరికి చనిపోయినట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

● కలకడ మండలం ఎగువతండా వాసి సిద్దులునాయక్ (55), నీలాబాయి (45) గిరిజన దంపతులు. ఎనిమిదేళ్ల కిందట నాటుసారా తీసుకొస్తూ గుర్రంకొండ పంచాయతీ సుకరవాండ్లపల్లె సమీప పొలాల్లో వేటగాళ్లు తీసిన కరెంటు తీగలకు చిక్కుకుని దంపతులిద్దరూ మృతి చెందారు. అప్పట్లో గిరిజనుల మృతి సంచలనం సృష్టించింది.

● సంగసముద్రం పంచాయతీ యల్లంపల్లి అటవీ ప్రాంతంలో ఆరేళ్ల కిందట కొందరు వేటగాళ్లు అడవి పందులను చంపడానికి తీసిన కరెంటు తీగలకు బలై ఓ ఆవు చనిపోయింది. అప్పట్లో వేటగాళ్ల విషయం బయటకు రాకుండా బాధితులకు గ్రామపెద్దల సహకారంతో గుట్టుచప్పుడు కాకుండా నష్టపరిహారం ఇచ్చారు.

● అదే గ్రామానికి చెందిన ఓ వేటగాడు 2018 మేలో అడవిలో జంతువులను వేటాడడం కోసం తీసిన కరెంటు ఉచ్చుకు చిక్కుకున్నాడు. ఈ సంఘటనలో వేటగాడి చేతికి తీవ్ర గాయమవడంతో తిరుపతి రుయా ఆస్పత్రిలో రెండు నెలలు చికిత్స చేయించుకున్నాడు, ఈ ప్రమాదంలో వేటగాడి కుడిచేయి మూడు వేళ్లు తొలగించారు.

● మండలంలోని మర్రిపాడుకు చెందిన రైతు నందమహారెడ్డి (70) నాలుగేళ్ల కిందట రాత్రి వేరుశనగ పొలం వద్దకు కాపలాగా ఉండేందుకు వెళుతూ వేటగాళ్లు తీసిన కరెంటు ఉచ్చుకు బలై ప్రాణాలు పోయాయి. ఇలా మండలంలో పలు గ్రామాల్లో వన్యప్రాణుల వేట నిత్యం జరుగుతోంది. ఈ వేటలో అడవి జంతువులు, అమాయక ప్రజలు చనిపోతున్నారు. తెలిసిన కొన్ని సంఘటనలు మాత్రమే బయటకు వస్తున్నాయి.

అటవీ శాఖాధికారులకు పట్టదా!

మండలంలోని మర్రిపాడు, చెర్లోపల్లి, ఎల్లుట్ల, గుర్రంకొండ, టి.పసలవాండ్లపల్లె, నడిమిఖండ్రిగ, సరిమడుగు, సంగసముద్రం, శెట్టివారిపల్లి, తరిగొండ అటవీ ప్రాంతాల్లో నిత్యం వేటగాళ్లు వన్యప్రాణులను చంపుతున్నారు. వేటగాళ్ల ఉచ్చుకు అడవి పందులు, నెమళ్లు, జింకలు కూడా బలవుతున్నట్లు సమాచారం. ఇలా వేటగాళ్ల అగడాలు రోజు రోజుకూ మితిమీరిపోతున్నా అటవీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మనుషుల ప్రాణాలు పోతున్నా వేటగాళ్లపై చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.


మామిళ్లవారిపల్లెలో నాటుబాంబు పేలి ఛిద్రమైన ఆవు నోరు (ఫైల్)

కరెంటును వాడడం నేరం కాదా!

అడవి జంతువులను చంపడానికి వేటగాళ్లు కరెంటును వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో వేటగాళ్లు పొలాల్లో ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్లను వేటకు వాడుకుంటున్నారు. కరెంటు ఉచ్చుకు అడవి జంతువులు, మనుషులు చిక్కుకున్న వెంటనే సంబంధిత సబ్‌స్టేషన్‌లో ఆయా విద్యుత్ లైన్ ట్రిప్ అవుతుంది. అప్పుడు సబ్‌స్టేషన్‌లో పనిచేసే డ్యూటీ ఆపరేటర్లు విద్యుత్ లైన్ ట్రిప్ అయిన సమయాన్ని రికార్డులో నమోదు చేస్తారు. వెంటనే తిరిగి ట్రిప్ అయితే విద్యుత్‌లైన్ చార్జ్ చేస్తారు. సాధారణంగా విద్యుత్ లైన్లు అధిక వర్షానికి, విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలు పడినప్పుడు మాత్రమే ట్రిప్ అవుతాయి. అలాకాకుండా లైన్లు వేటగాళ్ల స్వార్థానికి ట్రిప్ అవుతున్నా ట్రాన్స్‌కో అధికారులు కారణాలు తెలుసుకోకపోవడం వారి పని తీరుకు నిదర్శనంగా నిలుస్తోందని పలువురు అంటున్నారు. నిత్యం వేటగాళ్లు కరెంటును వేటకు వినియోగిస్తున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో ట్రాన్స్‌కో సిబ్బందిపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేటగాళ్లపై నిఘా ఉంచి చర్యలు తీసుకుంటాం

వన్యప్రాణుల వేట కోసం నాటుబాంబులు, కరెంట్ ఉచ్చును తీసే వేటగాళ్ల వివరాలను సేకరిస్తున్నాం. వేటగాళ్లపై వన్యప్రాణి చట్టం పరిధిలో కేసులు నమోదు చేయిస్తాం. అటవీ జంతువులను వేటాడితే కఠినంగా శిక్షపడేలా తగు చర్యలు తీసుకుంటాం.

- రామ్‌మోహన్, అటవీ శాఖ బీట్ ఆఫీసర్, గుర్రంకొండ

జడ్పీ చైర్మన్‌గా రామగోవిందరెడ్డి

● ఏకగ్రీవంగా ఎన్నిక


జడ్పీ చైర్మన్‌గా ముత్యాల రామగోవిందరెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జడ్పీ చైర్మన్ ఎన్నికకు హాజరైనట్టుగా సంతకం చేస్తున్న 98 సంవత్సరాల గాలివీడు జడ్పీటీసీ సభ్యురాలు షేక్ భానుబీ

కడప రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా పరిషత్ చైర్మన్‌గా బి.మఠం జడ్పీటీసీ సభ్యుడు ముత్యాల రామగోవిందరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జడ్పీ చైర్మన్ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. జిల్లా ఎన్నికల అధికారి, కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికకు కూటమి జడ్పీటీసీ సభ్యులు హాజరుకాలేదు.

దీంతో జడ్పీ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం అయింది. ప్రస్తుతం ఉన్న 48 మంది జడ్పీటీసీలలో 41 మంది హాజరయ్యారు. వీరిలో 98 సంవత్సరాల వయసున్న గాలివీడు జడ్పీటీసీ సభ్యురాలు షేక్ భానుబీ ఉన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన రామగోవిందరెడ్డితో జిల్లా ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించి డిక్లరేషన్ పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎంవీ రామ చంద్రారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, రమేశ్ యాదవ్, ఎమ్మెల్యేలు ఆకేపాటి అమరనాథరెడ్డి, డాక్టర్ దాసరి సుధ, జడ్పీ సీఈవో ఓబులమ్మ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

హాజరు కాని ఏడుగురు జడ్పీటీసీలు

జడ్పీ చైర్మన్ ఎన్నికకు 48 మంది జడ్పీటీసీ సభ్యులలో ఏడుగురు హాజరుకాలేదు. వీరిలో వేంపల్లె వైసీపీ జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డికి మాతృవియోగం కావడంతో ఆయన రాలేదు. మిగిలిన వారిలో వైసీపీ నుంచి కూటమిలోకి వచ్చిన ముద్దనూరు జడ్పీటీసీ బడుగు ఉమాదేవి, జమ్మలమడుగు జడ్పీటీసీ దండ్లూరు అశ్వని, చిన్నమండెం జడ్పీటీసీ మోడెం జయమ్మ, ఓబులవారిపల్లె జడ్పీటీసీ లక్ష్మీనరసయ్య, వీఎన్ పల్లె జడ్పీటీసీ రాజేశ్వరమ్మతో సహా టీడీపీకి చెందిన గోవరం జడ్పీటీసీ కలువాయి జయరామిరెడ్డి ఎన్నికకు హాజరుకాలేదు.

భక్తిశ్రద్ధలతో లైలతుల్ ఖదర్

● జిల్లా వ్యాప్తంగా ముస్లింల ప్రార్థనలు


పీలేరులోని మసీదులో ముస్లింల ప్రార్థనలు

పీలేరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలోని లైలతుల్ ఖదర్, షబ్-ఎ-ఖదర్ (సతామీ రాత్)ను గురువారం రాత్రి జిల్లాలోని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. లైలతుల్ ఖదర్ ఘడియలు ప్రారంభమయ్యే గురువారం సాయం సంధ్యవేళ నుంచి ముస్లింలు ఎక్కువగా ఉండే రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేట, ములకలచెరువు, బి.కొత్తకోట, వాల్మీకిపురం, కలికిరి ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. లైలతుల్ ఖదర్ సందర్భంగా గురువారం సాయంత్రం ఇఫ్తార్ అనంతరం అత్యధిక ముస్లింలు తమ ఇళ్లలోని పూర్వీకుల పేరుతో చదివింపులు (ఫాతెహా) చేసి పేదలకు అన్నదానం చేశారు. అనంతరం సామూహిక ప్రార్థనల కోసం మసీదులకు తరలి వెళ్లారు. లైలతుల్ ఖదర్ రాత్రులు ప్రాధాన్యత గురించి ఆయా మసీదుల్లోని ఇమామ్‌లు, మతపెద్దలు ధార్మికోపన్యాసాలు చేశారు. రాత్రి 12 గంటల తరువాత చాలా మంది తమ సమీప ఖబరస్థాన్‌లకు వెళ్లి తమ పూర్వీకుల సమాధులను సందర్శించి వారి ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

● మదనపల్లె ఆస్పత్రిలో చికిత్స


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్

మదనపల్లె అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విషద్రావణం తాగి ప్రేమజంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లె పట్టణంలోని బెంగళూరు బస్టాండ్‌లో బుధవారం అర్ధరాత్రి జరిగింది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు... తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువు మండలం మద్దినాయనిపల్లె వాసి కిరణ్ (29), పెద్దమండ్యం మండలానికి చెందిన బాలిక (16) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. రెండు రోజుల కిందట వారు ఇంటి నుంచి పారిపోయారు. యువతి కుటుంబసభ్యులు పెద్దమండ్యం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యంపై కేసు నమోదు చేశారు. బాలిక కోసం గాలిస్తుండగా కిరణ్ తీసుకెళ్లినట్లు తెలిసింది. పోలీసులు కిరణ్‌పై నిఘా పెట్టగా బెంగళూరుకు వెళ్లేందుకు మదనపల్లెలోని బెంగళూరు బస్టాండ్‌లో ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లగా వారిద్దరూ తమ వెంటతెచ్చుకున్న విషద్రావణాన్ని తాగి ఆత్మహత్యకు యత్నించారు. గుర్తించిన పోలీసులు వెంటనే తమ వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో కిరణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాలికను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

● టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి


కల్యాణవేదికను పరిశీలిస్తున్న అదనపు ఈవో వెంకయ్యచౌదరి

ఒంటిమిట్ట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయని టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి తెలిపారు. ఒంటిమిట్టలో జరుగుతున్న పనులను టీటీడీ జేఈవో వీరబ్రహ్మంతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకయ్యచౌదరి మాట్లాడుతూ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు ఏప్రిల్ 5న అంకురార్పణ జరుగుతుందని తెలిపారు. 6న శ్రీరామనవమి జరగనుండగా 11వ తేదీ జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం తరఫున సీతారాముల వారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కల్యాణవేదిక వద్ద భక్తుల ప్రవేశ నిష్ర్కమణ మార్గాల్లోను, ఆలయ పరిసర ప్రాంతాల్లో మరింతగా ఆకట్టుకునేలా పుష్పాలంకరణ, విద్యుద్దీపాలంకరణలు భక్తులు వీక్షించేలా ఎల్‌ఈడీ స్ర్కీన్‌లను, అన్న ప్రసాదాల పంపిణీ, భక్తులకు స్వామివారి తలంబ్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, తాగునీరు, మజ్జిగ అందించేందుకు వీలుగా పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అంతకుముందు అదనపు ఈవోకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి వచ్చే మార్గాలను, ఆలయ పరిసరాలు, కల్యాణవేదిక, క్యూలైన్లు భక్తులకు ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. అభివృద్ధి పనుల గురించి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, ఎస్‌ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, వీజీవోలు శ్రీరామ్‌కుమార్, సదా లక్ష్మీ, అన్నప్రసాద విభాగం, ప్రత్యేక అధికారి, జీవీఎల్‌ఎన్ శాస్త్రి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పీలేరు పంచాయతీ ఆదాయం రూ.42.84 లక్షలు

● రికార్డు స్థాయిలో పెరుగుదల

● గత ఏడాది కంటే రూ.24 లక్షలు అధికం


పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

పీలేరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పీలేరు గ్రామ పంచాయతీకి గతంలో కనీవిని ఎరుగని రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. పంచాయతీలోని ఆదాయ వనరుల నిర్వహణకు నిర్వహించిన వేలం పాటల ద్వారా పీలేరు పంచాయతీకి గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.42,84,500 ఆదాయం లభించింది. ఇది గత ఏడాది కంటే రూ.24.07 లక్షలు అధికం. (గత ఏడాది వేలం పాటల ద్వారా పంచాయతీకి రూ.18,77,500 లభించింది). దీంతో అటు పంచాయతీ అధికారులు, పాలకవర్గం, ఇటు సామాన్యులు హర్షాతిరేకాల వ్యక్తం చేయగా మామూళ్ల కోసం ఆశించి వచ్చిన సిండికేటుగాళ్లు మాత్రం నిరాశతో వెనుతిరిగారు. పీలేరు గ్రామ పంచాయతీ వేలం పాటల్లో సిండికేటుగాళ్ల మామూళ్ల పర్వంపై ఆంధ్ర జ్యోతిలో గురువారం 'పంచడమా...? పెంచడమా...!' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి అప్రమత్తమయ్యారు.

పంచాయతీకి ఆదాయం పెంచాలని, సిండికేటు వ్యవహారాలను సహించవద్దని పీలేరు ఈవో గురుమోహన్‌తో పాటు స్థానిక నాయకులను హెచ్చరించారు. దీంతో అటు అధికారులు, ఇటు స్థానిక టీడీపీ నాయకులు వేలం పాటలను పారదర్శకంగా నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగా తొలుత వారపు సంతను చింతపర్తికి చెందిన ఆశోక్‌రెడ్డి రూ.28,25,000లకు దక్కించుకున్నారు. దినసరి కూరగాయల మార్కెట్ రూ.5,55,000, ప్రైవేటు బస్టాండు రూ.6,02,000, జంతు వధశాల రూ.3,02,500 పలికాయి. ఆ తరువాత మధ్యాహ్నం జరిగిన పంచాయతీ గదుల అద్దెలను నెలకు రూ.1.10 లక్షలకు వేలం వేశారు. వేలం పాటలను సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సీఐ యుగంధర్ తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వేలం జరిగే గదిలోకి అందరినీ అనుమతించకుండా కేవలం డీడీలు చెల్లించిన వారిని మాత్రమే పోలీసులు అనుమతించడంతో గందరగోళం తప్పింది. వేలం పాటల మధ్య చిన్న చిన్న వాగ్వాదాలు తప్ప ఎటువంటి ఉద్రిక్త పరిస్థితులు లేకుండా అంతా ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు, పీలేరు సర్పంచ్ డా.హబీబ్ బాషా, ఈవోపీఆర్‌ఆర్‌డీ లతీఫ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భోగంపల్లె రిజర్వాయర్ వద్ద పోలీసుల నిఘా


భోగంపల్లె రిజర్వాయర్ వద్ద పరిశీలిస్తున్న సీఐ ప్రసాద్‌బాబు, ఎస్‌ఐ చంద్రశేఖర్

వాల్మీకిపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణం సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ వద్ద పోలీసు అధికారులు ముమ్మర నిఘా పెట్టారు. రిజర్వాయర్‌లో ఇసుక అక్రమ తవ్వకాలపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో రెండురోజుల క్రితం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. రెండు రోజులుగా పోలీసు, రెవెన్యూ అధికారులు సైతం అక్రమ తవ్వకాల పట్ల ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గురువారం సీఐ ప్రసాద్‌బాబు, ఎస్‌ఐ చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టణానికి తాగునీరు సరఫరా చేసే రిజర్వాయర్ ప్రాంతంలోని బోరుబావుల వద్ద కానీ, రిజర్వాయర్‌లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేసే దిశగా నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై రిజర్వాయర్ వద్ద ఇసుక మాఫియా ఆగడాలు సాగనివ్వమని తెలిపారు.

గోపవరంలో హైటెన్షన్

- ఉత్కంఠగా మారిన ఉపసర్పంచ్ ఎన్నిక
- ఇరు పార్టీల బలప్రదర్శన
- వైసీపీ వార్డు మెంబర్లు హాజరు కాకుండా అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- రాళ్లదాడి - పోలీసుల స్వల్ప లాఠీఛార్జి
- కోరం లేక ఎన్నిక వాయిదా


గోపవరం పంచాయతీ కేంద్రం వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు, డీఎస్పీ భావన


ఎన్నిక కేంద్ర సమీపంలో మోహరించిన పార్టీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ఉత్కంఠంగా మారింది. వైసీపీ వార్డు మెంబర్లను ఎన్నిక కేంద్రానికి వెళ్లనివ్వకుండా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైసీపీ వార్డు మెంబర్ల వాహనాలపై రాళ్ల దాడి చేయడంతో వాహన డ్రైవరు, వార్డు మెంబర్లకు స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నంలో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేశారు. వివరాలిలా..

గోపవరం పంచాయతీలో మొత్తం 20 మంది వార్డు మెంబర్లలో 14 మంది వైసీపీకి ఉండగా ఆరుగురు టీడీపీ వైపు ఉన్నారు. ఉపసర్పంచ్ పదవిని తమ ఖాతాలోకి వేసుకునేందుకు టీడీపీ పావులు కదిపింది. గోపవరం ఉపసర్పంచ్ పదవిలో రెండున్నర సంవత్సరం ఓసీ అభ్యర్థిని మరో రెండున్నర సంవత్సరం బీసీ అభ్యర్థిని ఉపసర్పంచ్‌గా నిలబెడుతానని అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాట ఇచ్చారు. ఒప్పందం మేరకు కాల పరిమితి పూర్తి అయిన అనంతరం ఉపసర్పంచ్ బీరం రాఘవేంద్రారెడ్డి రాజీనామాచేశారు. ఎన్నికల నోటిఫికేషన్ ఆలస్యం కావడం, ప్రభుత్వం మారడం, కొంతమంది వైసీపీ వార్డు మెంబర్లు టీడీపీలోకి చేరడంతో గత ఎమ్మెల్యే బీసీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారు. దీంతో రాజీనామా చేసిన ఉపసర్పంచ్ బీరం రాఘవేంద్రారెడ్డిని మళ్లీ బరిలోకి దింపడం.. వైసీపీ వార్డు మెంబర్లతో క్యాంపు రాజకీయాలు నడిచాయి. ఈ నేపథ్యంలో ఆరుగురు టీడీపీలోకి చేరారు. ఉప సర్పంచ్ పదవిని తమ ఖాతాలోకి వేసుకునేందుకు ఆ పార్టీ నేతలు ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఎన్నిక సందర్భంగా గురువారం ఉదయం ఎన్నిక కేంద్రం వద్దకు వచ్చిన బీరం రాఘవేంద్రారెడ్డి, పవన్‌కుమార్‌పై టీడీపీ శ్రేణులుదాడికి పాల్పడారు. వీరి నుంచి తప్పించుకుని ఇరువురు ఎన్నిక కేంద్రమైన గోపవరం పంచాయతీ కార్యాలయంలోకి చేరుకున్నారు. అప్పటికే టీడీపీకి చెందిన ఆరుగురు వార్డు సభ్యులు ఎన్నిక కేంద్రంలో ఉన్నారు. మిగిలిన 12 మంది వైసీపీ వార్డు మెంబర్లు వాహనాల్లో ఎన్నిక కేంద్రానికి వెళ్లడానికి ప్రయత్నించగా టీడీపీ శ్రేణులు అడ్డుకుని దాడికి యత్నించారు. దీంతో వారు వెనుతిరిగారు. ఇలా రెండు మూడు సార్లు ఎన్నిక కేంద్రానికి వైసీపీ వార్డు మెంబర్లు హాజరయ్యేందుకు ప్రయత్నించగా వారి వాహనాలపై రాళ్లదాడి జరిగింది. పోలీసులు లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపు చేశారు.

నకిలీలతో కోరం చూపించే యత్నం

గోపవరం ఉప సర్పంచ్ ఎన్నికల్లో మొత్తం 20 మంది వార్డు మెంబర్లు ఉన్నారు. వీరిలో టీడీపీకి చెందిన ఆరుగురు ఎన్నిక కేంద్రానికి హాజరయ్యారు. వైసీపీకి చెందిన ఉపసర్పంచ్ అభ్యర్థి బీరం రాఘవేంద్రారెడ్డి, పవన్‌కుమార్‌లు టీడీపీ శ్రేణుల నుంచి తప్పించుకుని లోనికి ప్రవేశించారు. అప్పటికి మొత్తం ఎనిమిది మంది వార్డు సభ్యులు లోపల ఉన్నారు. మిగిలిన వార్డు మెంబర్లను ఎన్నికకు హాజరుకాకుండా ఎక్కడికక్కడ అడ్డుకోవడంతో బయట ఉద్రిక్తత నెలకొంది. ఎన్నిక కొనసాగాలంటే 11 మందితో కోరం ఉండాలి. దీంతో 10వ వార్డు మెంబరు కందుల బీబీ, 9వ వార్డు అభ్యర్థి షేక్ ఖాదర్‌బాష, 4వ వార్డు మెంబరు కేశవస్థానంలో వారి పేర్లతో ముగ్గురు నకిలీలు ఎన్నిక కేంద్రానికి చేరుకున్నారు. వీరిని గోపవరం మూడవ గ్రామ సచివాలయ కార్యదర్శి ఈశ్వరి పరిశీలించి నకిలీలుగా గుర్తించారు. అయినప్పటికి అధికార బలంతో ఎన్నిక కేంద్రంలోకి ఆముగ్గురు చొరబడ్డారు. లోన ఉన్న వైసీపీ అభ్యర్థులు రాఘవేంద్రారెడ్డి వారు నిజమైన అభ్యర్థులు కారని, నకిలీలు అని వాదించారు. దీంతో అధికారులు వారిని బయటికి పంపించారు. ఎన్నిక సమయం గడువు ముగియడం, సభ్యులు హాజరుకాకపోవడంతో కోరం లేదని ఎన్నిక నిర్వహణ అధికారి, మండల ఈవోపీఆర్‌డీ రామాంజనేయులరెడ్డి ఎన్నికను వాయిదా వేసి పంచాయతీ కార్యదర్శితో కలిసి పోలీసు బందోబస్తుతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఎన్నిక వాయిదా పడకుండా కొంతమంది టీడీపీ నాయకులు ఎన్నిక కేంద్రం వద్దకు చేరుకుని విశ్వప్రయత్నాలు చేశారు. మరోవైపు కొర్రపాడు రోడ్డులో మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, మండల వైస్‌చైర్మన్ బంగారురెడ్డి, వైసీపీ నాయకులు తమ వర్గీయులతో మోహరించారు. వారి వద్ద ఉన్న 12 మంది అసలైన వార్డు మెంబర్ల వీడియోలను తీసి జిల్లా ఉన్నతాధికారులకు పంపించి ఇక్కడ జరిగే ఎన్నిక వాయిదా వేయడంపై అభ్యంతరం తెలిపారు. ఎన్నిక కేంద్రంవద్ద నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు ఎన్నిక కేంద్రానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. డీఎస్పీ భావన, సీఐలు శివరాముడు, రామక్రిష్ణ, బాలమద్దిలేటి, ఎస్‌ఐలు ధనుంజయుడు, శ్రీనివాసులు, మహమ్మద్‌రఫి, మరో 50 మంది పోలీసులు ఎన్నిక బందోబస్తులో పాల్గొని ఎప్పటికప్పుడు పరిస్థితిని సద్దుమనిగేలా చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు ఉపసర్పంచు ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేస్తూ ఎన్నికల నిర్వహణ అధికారి ప్రకటించారు. తదనంతరం టీడీపీ వార్డు మెంబర్లు అక్కడి నుంచి వెళ్లిపోగా వైసీపీ వార్డు మెంబర్లు రాఘవేంద్రారెడ్డి, పవన్‌కుమార్‌లను పోలీసు బందోబస్తుతో వారి ఇళ్లవద్దకు చేర్చారు.

'గండి'లో హుండీ లెక్కింపు.. రూ.7లక్షలు ఆదాయం


గండి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

చక్రాయపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం కమిషనరు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. 45 రోజులకు గాను భక్తులు సమర్పించిన కానుకులను లెక్కించగా రూ.7,07,750 ఆదాయం వచ్చింది. అలాగే నిత్యాన్నదాన పథకానికి రూ.14,407 ఆదాయం వచ్చింది. కాగా, కూరగాయల టెండర్లకు వేలం నిర్వహించగా ఎక్కువ మంది పోటీ పడటంతో ప్రస్తుతానికి రద్దు చేశారు. కార్యక్రమంలో గండి దేవస్థాన చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, మెంబరు వెంకట్రామిరెడ్డి, ఆలయ సిబ్బంది, త్రిబుల్‌ఐటీ విద్యార్థులు, బ్యాంకు అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు క్యాంపస్ ఉద్యోగాలు


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టరు కుమారస్వామి గుప్త, తదితరులు

వేంపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ సీఎస్‌సీ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు లభించాయి. హైదరాబాదుకు చెందిన పోసిడెక్స్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఇందులో 9మంది విద్యార్థులు రూ.6లక్షల వార్షిక వేతనానికి ఎంపికైనట్లు డైరెక్టరు కుమారస్వామి గుప్త, ఏవో పెనుగొండ రవికుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ప్లేస్‌మెంటు కోఆర్డినేటరు వినోద్, ప్లేస్‌మెంటు ఆఫీసరు సుందర్‌లను అభినందించారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి


జమ్మలమడుగు అర్బన్ పోలీసుస్టేషన్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

జమ్మలమడుగు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను విచారించి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్, డీఎస్పీ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. అర్బన్‌స్టేషన్‌లో ఆవరణాన్ని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాని సూచించారు. అనంతరం సైబర్‌నేరాలకు సంబంధించి పోలీసు అధికారులతో చర్చించారు. మట్కా, క్రికెట్, బెట్టింగ్, గ్యాంబ్లిక్ తదితర నేరాలు జరుగకుండా గట్టిగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు లింగప్ప, గోపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు రామక్రిష్ణ, సుబ్బారావు, లక్ష్మీనారాయణ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మైదుకూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో నంద్యాల రోడ్డులోని మహబూబ్‌నగర్‌లో నివశిస్తున్న గోర్ల పాపయ్యగారి సుబ్బలక్షుమ్మ (49) అనే మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. సుబ్బలక్షుమ్మ గత శుక్రవారం రాత్రి తన కుమార్తెతో కలిసి ఇంటిపై నిద్రిస్తుండగా అర్ధరాత్రి కాలకృత్యాల కోసం కిందకు వస్తుండగా ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారి పడింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మరణించినట్లు ఆమె బంధువులు తెలిపారు. సుబ్బలక్షుమ్మకు భర్త, ముగ్గురు కుమార్తెలు కాగా, ఒక కుమార్తెకు వివాహమైంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..


సంఘటనా స్థలంలో డోలా సతీష్ మృతదేహం

రైల్వేకోడూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరాజుపురం పంచాయతీ గంగరాజుపురం ప్రధాన జాతీయ రహదారిపై గురువారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు రాఘవరాజుపురం పంచాయతీ హరిజనవాడకు చెందిన దివ్యాంగుడు డోలా సతీష్ (38)గా గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహన్ని శవ పరీక్ష నిమిత్తం కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కోడూరు ఎస్‌ఐ నవీన్ బాబు తెలిపారు.

లారీ బోల్తా - ఒకరి మృతి

బోల్తాపడిన లారీ



ఖాజీపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు సమీపంలో లారీ బోల్తాపడిన సంఘటనలో డ్రైవర్‌మాబూసాహెబ్(47) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మైదుకూరు నుంచి కడపవైపు వెళుతున్న లారీ పత్తూరు సమీపంలోకి రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో బోల్తాపడింది. దీంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మృతుడు మాబూసాబ్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలి

- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్

కడప రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025 ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయ విధానాలను సమర్థవంతంగా అమలు చేసి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందికి శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ ద్వారా సిబ్బందికి అవసరమైన నైపుణ్యాలను అందిస్తున్నామన్నారు. పకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించడంలో ఈ శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. జిల్లాలోని వ్యవసాయ సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు, ప్రీ-మాన్సూన్ డ్రైసోయింగ్, స్వయం సహాయక సంఘాల ద్వారా రైతుల సాధికారత వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. హార్టికల్చర్ అధికారి సిందూరి ఆ శాఖ ద్వారా అందిస్తున్న వివిధ రకాల సబ్సిడీల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు పీడీఎం వసంతకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జడ్‌హెచ్‌డీసీ భూముల పరిశీలన


జడ్‌హెచ్‌డీసీ భూములపై విచారణ చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి

రాజంపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం తాళ్లపాక గ్రామ పరిధిలోని జడ్‌హెచ్‌డీసీ భూములను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా 1984లో సుమారు 50 మంది ఎస్సీలకు ఇచ్చిన భూములను పరిశీలించారు. ఎస్సీల కోసం కోళ్లఫారాల పరిశ్రమల అభివృద్ధి కోసం ఈ భూములను ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఈ భూములను సక్రమంగా వినియోగించుకోలేదని, ఇతరులు ఆక్రమించారని ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ ప్రాంతంలో ఆలయాన్ని కూడా నిర్మిస్తున్నారని ఈ అంశాలపై తాము విచారణ చేస్తున్నామన్నారు. ఎస్సీలకు కేటాయించిన ఈ భూముల్లో ఎటువంటి ఆక్రమణలు జరిగినా తహశీల్దారుతో సర్వే చేయించి కలెక్టర్‌కు నివేదిక పంపి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత డీఎస్సీ శిక్షణ

కడప ఎన్టీఆర్‌సర్కిల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దశ-2 ఎంపికలకు ఈ నెల 28 చివరి తేదీ అని తెలిపారు. ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం లిస్ట్ చేయబడిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితా వెబ్ పోర్టల్‌లో ప్రదర్శించినట్లు వివరించారు. 26వ తేదీ లోపు ఆప్షన్ సర్వీస్ ద్వారా కోచింగ్ సంస్థలకు తమ ప్రాధాన్యతలు సూచించాలని తెలిపారు. దశ వన్ వెబ్ ఆప్షన్‌కు ఎడిట్ ఆప్షన్ లేదని తెలిపారు.

ఇరువురు గంజాయి విక్రేతల అరెస్టు

కడప క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పాత బైపాస్‌లోని సంజన్న సర్కిల్ వద్ద గంజాయి అమ్ముతున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు కడప ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్ తెలిపారు. కడపకు చెందిన దూదేకుల సిద్దు, తాటి నాగసురేశ్ కుమార్‌లు ద్విచక్ర వాహనంలో సంజన్న సర్కిల్ వద్దకు వచ్చి గంజాయి విక్రయిస్తు న్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి సిబ్బందితో దాడి చేసి వారిని అరెస్టు చేసి 1250 గ్రాములు గంజాయిని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో వ్యక్తి గిద్దలూరుకు చెందిన దాసరిగాని పరారయ్యాడని.. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పట్టుబడిన ఇరువురిని రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

30 నుంచి పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు


పెద్దపీరయ్యస్వామి జీవ సమాధి ఫొటో

బ్రహ్మంగారిమఠం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి శిష్యుడు సిద్దయ్యస్వామి కుమారుడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు ఈనెల 30, 31 తేదీలలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠాధిపతి కలుగోట్ల సిద్దయ్య తెలిపారు. గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఆరాధనోత్సవాల సందర్భంగా 30న ఆదివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు రాత్రి గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులకు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో యాదవ అన్నసత్రంలో అన్నదాన కార్యక్రమం, రాత్రి 10గంటలకు గోపాల్ బృందం వారిచే రేలారే రేలా కార్యక్రమం, సినీ ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు. అలాగే బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటకం, పట్టాభిస్వామి కోలాటం ఉంటుంది. 31న చిన్న, పెద్ద వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళా క్రికెట్‌లో రాణిస్తున్న శ్రీచరణి

- బీసీసీఐ సీనియర్ మహిళా చాలెంజర్స్ ట్రోఫీలో ప్రతిభ
- తొలిరోజే మల్టీడేస్ మ్యాచ్‌లో 6 వికెట్లు కైవసం



కడపస్పోర్ట్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన మహిళా క్రీడాకారిణి ఎన్.శ్రీచరణి బీసీసీఐ సీనియర్ మహిళా చాలెంజర్స్ ట్రోఫీలో రాణించారు. డెహ్రాడూన్ రాజీవ్ గాంధీ ఇంటర్‌నేషనల్ స్టేడియంలో నిర్వహించిన బీసీసీఐ సీనియర్ ఉమెన్స్ చాలెంజర్స్ ట్రోఫీలో యర్రగుంట్ల మండలం యర్రంపల్లెకు చెందిన నల్లపురెడ్డి శ్రీచరణి ఏకంగా 6 వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టును కోలుకోలేని దెబ్బతీశారు. అక్కడి మల్టీడేస్ మ్యాచ్‌లో టీం-ఎ, టీం-బీ జట్లు తలపడగా టీం-బీ జట్టుకు శ్రీచరణి ప్రాతినిథ్యం వహిస్తూ వేసిన 32 ఓవర్లలో 8 మెయిడిన్ ఓవర్లతో పాటుగా 6 వికెట్లు సాధించారు. కాగా జిల్లాకు చెందిన శ్రీచరణి జాతీయ స్థాయిలో సత్తా చాటుతుండడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ అభినందనలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


భరత్ మృతదేహం, భరత్ (ఫైల్)

తంబళ్లపల్లె, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావిలో పడి ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం తంబళ్లపల్లె మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యుల వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండల కేంద్రం తూర్పు హరిజనవాడకు చెందిన జి.వెంకట్రమణ కుమారుడు భరత్(27) బుధవారం మధ్యాహ్నం స్నేహితులతో కలసి బయటకు వెళ్లా డు. తంబళ్లపల్లెకు సమీపంలోని రేణుమాను బావి గట్టు మీద కూర్చుని స్నేహితులతో కలసి మద్యం సేవించారు. అర్ధరాత్రైనా భరత్ ఇంటికి రాకపోవడం, ఫోన్ తీయకపోవడంతో కంగారు పడిన తల్లితండ్రులు.. బంధువుల ఇళ్లతో పాటు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. చివరికి రేణుమాను బావి వద్ద వెతకడంతో గట్టు మీద మృతుడి చెప్పులు, సెల్‌ఫోన్ లభ్యమయ్యాయి. దీంతో భరత్ బావిలో పడిపోయాడనే అనుమానంతో తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఉదయం ఎస్‌ఐ లోకేష్ రెడ్డి, సిబ్బంది బావి వద్దకు చేరుకుని స్థానికులు, మృతుడి కుటుంబసభ్యుల సహాయంతో పాతాలభైరవి, నీటి కెమెరాలతో బావిలో తీవ్రంగా గాలించారు. బావి పెద్దదిగా ఉండటం, అందులోని నీళ్లు ఎక్కువగా పాచి పట్టి ఉండటంతో ఎంత శ్రమించినా మృతుడి ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో సాయంత్రం 6 గంటల సమయంలో మృతుడు భరత్ బావిలో శవమై పైకి తేలాడు. ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానికుల సహాయంతో వెలికితీయించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, భరత్ ఓ ప్రవేటు బస్సులో కండక్టర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉన్నాడు. చేతికి అంది వచ్చిన కొడుకు మృతిచెందడంతో తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమ కొడుకు మృతిపై అనుమానాలున్నాయని పోలీసులు సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని భరత్ తల్లితండ్రులు, కుటుంబసభ్యులు కోరుతున్నారు.

మధ్యంతర భృతి, కరువు భత్యం ప్రకటించాలి

● నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు



ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ నాయకులు

రాయచోటిటౌన్, మార్చి27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు కరువు భత్యంతో పాటు కనీసం ఒక డీఏని విడుదల చేసి పీఆర్సీ కమిషన్‌ను నియమించి నివేదిక వచ్చే లోగా మధ్యంతర భృతిని ప్రకటించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు కోరారు. గురువారం ఆయన పులివెందులలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసన మండలి సభ్యుడు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై కార్యాచరణ సిద్ధం చేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని విన్నవించారు. ఎన్‌టీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డిరమేశ్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి సురేశ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ అబ్దుల్ గఫార్, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏటీ రామకృష్ణమరాజు, రామసుబ్బన్న, జిల్లా గౌరవాధ్యక్షుడు కూరాకు రవీంద్ర, నాయకులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు పెట్టొద్దు

సిద్దవటం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతాన్ని కాపాడుకుందాం అని, అడవికి నిప్పు పెట్టవద్దని ఫారెస్ట్ రేంజ్ అధికారిణి కళావతి సూచించారు. గురువారం మండలంలోని గొల్లపల్లె గ్రామ ప్రజలకు నిప్పు పెట్టడం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తే తమకు తెలియజేయాలని, వాటికి హాని చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పేరాలగుట్ట బండరాళ్ల వేలం

గాలివీడు, మార్చి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరాన్‌చెరువు గ్రామం గేటు కుమ్మరపల్లి వద్ద నున్న పేరాలగుట్ట బండరాళ్ల కంకర రవాణా వాహనాములపై 2025-26 సంవత్సరం గానూ గేటు బహిరంగ వేలం పాటు ఉంటుందని సర్పంచ్ దీప్తి, పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సంబంధిత ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని, పూర్తి వివరాలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని ఈ సందర్భంగా కోరారు.

ఉపాధి పని దినాలు పెంచాలి

రైల్వేకోడూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పని దినాలు 200 రోజులకు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరు మండలం మైసూరివారిపల్లెలో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 10 వారాలుగా కూలి డబ్బు పడడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు జీతాలు పడకుంటే ఎలా విలవిల్లాడుతుంటతారో కూలి డబ్బు మూడు నెలలుగా పడకుంటే కూలీలు ఎలా ఉంటారని ప్రశ్నించారు. ఇప్పటికైనా వారికి కూలి డబ్బు ఇవ్వాలని విన్నవించారు.

సోలార్ నీటి పథకం అంతేనా..?

● రూ.లక్షలు ఖర్చు పెట్టారు .. పట్టించుకునే నాథుడు లేడు..



నిరుపయోగంగా ఉన్న సోలార్ నీటి పథకం



అప్పట్లో బిగించిన కొళాయి

సంబేపల్లె, మార్చి27(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సోలార్ నీటి పథకానికి మంగళం పలికారు. మండలంలో 2014-19 మధ్యకాలంలో మండలానికి రెండు సోలార్ నీటి పథకాలను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో నీటి పథకానికి రూ.6 లక్షల చొప్పున మంజూరు చేసి బిగించారు. ప్రజలకు 24 గంటలు సోలార్‌తో తాగునీటిని అందించాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ పథకాలు గత కన్ని రోజులకే మూలనపడ్డాయి. అప్పటి నుంచి వీటిని పట్టించుకునే నాథుడే లేడు. సంబేపల్లె మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న తాగునీటి బోరుకు సోలారు కనెక్షన్‌తో నీటి పథకం ఏర్పాటు చేశారు. దీంతోపాటు సంబేపల్లె గ్రామ పంచాయతీలో దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం మరొక సోలార్ నీటి పథకాన్ని బిగించారు. ఆలయం నిర్మాణ పనులు చేపట్టిన సమయంలో ఆ నీటి పథకాన్ని తొలగించారు. తర్వాత వదిలేశారు. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి వృథాగా వదిలేయకుండా ఇప్పటికైనా వీటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి రుబీనా

సుండుపల్లె, మార్చి27(ఆంధ్రజ్యోతి): వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ రుబీనా తెలిపారు. గురువారం రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కురవపల్లిలో వడదెబ్బ పైన ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం వేళల్లో పనులకు వెళ్లాలని, గొడుగు లేదా తెల్లని బట్టలను తలపైన ఉండేలా చూడాలన్నారు. మంచినీటిని అధికంగా తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలిన వెంటనే చల్లని ప్రదేశంలో ఉంచి ఓఆర్ఎస్, మజ్జిగ, మంచినీరు తాపించి వైద్యశాలకు తీసుకెళ్లాలన్నారు.

రాయచోటి మండల వైస్ ఎంపీపీ-2గా నాగసుబ్బమ్మ



రాయచోటిటౌన్, మార్చి27 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల వైస్ ఎంపీపీ-2కు గురువారం జరిగిన ఎన్నికల్లో రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల ఎంపీటీసీ-2 బోడిరెడ్డి నాగసుబ్బమ్మను వైస్ ఎంపీపీ-2గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో అత్యవసర సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల అధికారి లక్ష్మీపతి, ఎంపీడీవో వెంకటేశ్‌ల అధ్వర్యంలో వైస్ ఎంపీపీ-2 ఎన్నిక నిర్వహించారు. రాయచోటి మండల పరిధిలో 10 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా అందులో గొర్ల ముదివేడు, కాటిమాయకుంట ఎంపీటీసీలు మృతి చెందారు. ఈ క్రమంలో మిగిలిన 8 మంది సభ్యులకు గానూ ఐదుగురు సభ్యులు హాజరు కావడంతో ఎన్నిక నిర్వహించారు. వైస్ ఎంపీపీ-2కు సంబంధించిన శిబ్యాల-2 ఎంపీటీసీ బోడిరెడ్డి నాగసుబ్బమ్మను యండపల్లె ఎంపీటీసీ జయపాల్‌రెడ్డి ప్రతిపాదించగా శిబ్యాల ఎంపీటీసీ-1 పల్లపు రాజమ్మ బలపరిచారు. అయితే వైస్ ఎంపీపీ-2ఎకు సంబంధించి మరో నామినేషన్ లేకపోవడంతో బోడిరెడ్డి నాగసుబ్బమ్మను వైస్ ఎంపీపీ-2గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

ఎంత కష్టం.. ఏమిటీ నిర్లక్ష్యం..?



లక్కిరెడ్డిపల్లె, మార్చి 27(ఆంధ్రజ్యోతి):మండలంలోని లక్కిరెడ్డిపల్లె-కాలాడివాండ్లపల్లె రోడ్డు నరకం చూపిస్తోం దని పలువురు పేర్కొన్నారు. 2017లో టీడీపీ ప్రభుత్వంలో అప్పకొండయ్యగారిపల్లె నుంచి కాలాడివాండ్లపల్లెకు రూ. 45 లక్షలతో తారోడ్డు మంజూరైంది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు నిలిపివేశారని, నేటికీ పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు.

గంగమ్మతల్లిని దర్శించుకున్న చమర్తి, అతికారి



రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, జనసేన పార్టీ నేత అతికారి కృష్ణకు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

ఒంటిమిట్ట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఒంటిమిట్టలో జరిగిన నడివీధి గంగమ్మ జాతరలో రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, జనసేనపార్టీ నాయకులు అతికారి కృష్ణ గంగమ్మతల్లిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాడా రామాంజనేయులు ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ కాంట్రాక్టర్ ఎస్వీ రమణ, చింతరాచపల్లె సర్పంచ్ ప్రతినిధి రమణ, డాక్టర్ కృష్ణ, పసుపులేటి వెంకటరమణ, పీవీ రమణ, రోశయ్య, జయకృష్ణ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



హసనాపురంలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

రామాపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని రాష్ట్ర రోడ్డు రవాణ,యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని హసనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. రంజాన్ అంటే ప్రేమ, సోదరభావం, మానవత్వం, సద్గుణం అన్నారు. సీఎం చంద్రబాబు ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు పనులను అడ్డుకున్న గ్రామస్థులు

● త్రీఫేస్ అన్నారు.. సింగిల్ ఫేస్ పనులు చేయడంతో ఆందోళన



కాంట్రాక్టర్‌తో వాగ్వాదం చేస్తున్న గ్రామస్థులు

నందలూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భారత్‌గ్యాస్ నుంచి నీలిపల్లెకు వెళ్లేదారిలో నిర్వహిస్తున్న విద్యుత్ కాంట్రాక్టు పనులను నీలిపల్లె గ్రామస్థులు అడ్డుకున్న సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా నీలిపల్లె గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామానికి ముందు సింగిల్ ఫేస్ విద్యుత్‌లైను ఉండేదని, ప్రస్తుతం త్రీఫేస్ విద్యుత్ ప నులను విద్యుత్ అధికారుల ఆధ్వర్యం లో కాంట్రాక్టు మొదలు పెట్టారన్నారు. కాంట్రాక్టర్ కొద్దిదూరం త్రీఫేస్ లైను లాగి మధ్యలో సింగిల్ ఫేస్ లాగడం మొదలు పెట్టడంతో తాము అడ్డుకున్నామన్నారు. ఇదిగాక గ్రామానికి వెళ్లే దారిలో దాదాపు 50 ఏళ్లకు పైగా వయస్సు గల వృక్షాలను విద్యుత్‌లైను ఏర్పాటుకు అనుకూలంగా తొలగించాల్సిన చెట్లను ఇష్టానుసారంగా నరికివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చెట్ల వల్ల గ్రామానికి వెళ్లే దారిలో పాదచారులకు నీడ సౌకర్యం ఉండేదన్నారు. చెట్లను నరికేందుకు అటు రెవెన్యూ, ఇటు ఆర్అండ్‌బీ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా పనులు చేపట్టారని ఆరోపించారు. చివరకు కాంట్రాక్టరు త్రీఫేస్ లైను లాగేందుకు ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు.

రైల్వేకోడూరు అభివృద్ధికి నారా లోకేశ్ సుముఖం

● టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి



లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రూపానందరెడ్డి

రైల్వేకోడూరు రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు అభివృద్ధికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సుముఖంగా ఉన్నారని కుడా చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. గురువారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. మంగంపేటలో ఏపీఎండీసీ స్కూల్‌లో జూనియర్ కాలేజీ, కోడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ డయాలసిస్ కేంద్ర ఏర్పాటు చేయాలని, చిట్వేలి, కోడూరు మండలాల్లో ఉర్దూ పాఠశాలలకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలని కోరినట్లు తెలిపారు. అందుకు స్పందించిన నారా లోకేశ్ ఆయా పనుల మంజూరుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారని రూపానందరెడ్డి పేర్కొన్నారు.

రంజాన్ ప్రార్థనలు నూతన ఈద్గాలోనే...



ఈద్గా స్థలాన్ని సిద్ధం చేస్తున్న ముస్లింలు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రంజాన్ ప్రార్థనలు మండలంలోని మైసూరివారిపల్లి పంచాయతీలో ఉన్న నూతన ఈద్గాలోనే నిర్వహిస్తున్నట్లు కోడూరు జామీయా మసీద్ కమిటీ గురువారం ప్రకటించింది. ముస్లింలు ఉదయం 8:30 గంటలకు ఈద్గా వద్దకు చేరుకోవాలని, నమాజ్ 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈద్గా స్థలం కోసం సహకరించిన కుడా చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, జనసేన నాయకులు, మైసూరివారిపల్లి గ్రామస్థులకు ముస్లింలు ధన్యవాదాలు తెలిపారు.

పనిముట్లు లేకుంటే ఎలా పనిచేయాలి ?

● పారిశుధ్య కార్మికుల ఆవేదన



నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను చుట్టుముట్టిన మహిళలు

సిద్దవటం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :పనిముట్లు లేకుంటే ఎలా పనిచేయాలని పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని మాధవరం-1 గ్రామం వెంకటేశ్వరపురంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ హరితరాయబారులు మాట్లాడుతూ సక్రమంగా పనిచేయాలంటే పనిముట్లు ఉండాలని కదా అన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసి న సమీక్ష సమావేశంలో వెంకటేశ్వరపురం గ్రామ నీటి సమస్యను విన్నవించారు. ఎంపీడీవో పణిరాజకుమారి మాట్లాడుతూ నీటి సమస్యను ఐదు రోజుల్లోపు పరిష్కరిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్, ఏపీవో నరసింహులు, టీడీపీ నియోజకవర్గ ముస్లిం మైనార్టీ నేత డాక్టర్ వీరభద్రుడు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు సభ్యులకు ఈకేవైసీ తప్పనిసరి

సిద్దవటం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేషన్ కార్డు కలిగి వారందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఈకేవైసీ పూర్తికాని సభ్యులకు ప్రభుత్వ పథకాలు మంజూరులో ఇబ్బంది ఏర్పడవచ్చన్నారు.సమీపంలోని చౌకదుకాణం డీలరు వద్ద ఈకేవైసీ చేయించుకోవచ్చునన్నారు. ఐదు సంవత్సరాలు దాటిన పి ల్లలు ఆధార్ సెంటర్‌లో కూడా అప్‌డేట్ చేయించుకోవచ్చన్నారు.

రక్తదానం చేయండి... ప్రాణదాతలు కండి

రైల్వేకోడూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): చిరంజీవి కుమారుడు, ప్రముఖ సినీనటుడు రామ్‌చరణ్ 40వ జన్మదిన వేడుకల సందర్భంగా అభిమాని పురుషోత్తం ఆధ్వర్యంలో గురువారం గంగమ్మ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 70 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ ప్రతి ఏటా రామ్‌చరణ్ జన్మదిన వేడుకల సందర్భంగా ఏదో ఒక కార్యక్రమాన్ని చేయిస్తున్నామన్నారు. తిరుపతి ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు వారికి రక్తాన్ని అందజేశారు.

వన్యప్రాణులకు నీటి కొరత తీర్చేందుకు చర్యలు



అడవిలో సాల్ట్ లింకులను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సిద్దవటం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం ఫారెస్ట్ రేంజి పరిధిలో వన్యప్రాణులకు నీటి కొరత తీర్చేందుకు తగు చర్యలు చేపట్టినట్లు ఫారెస్ట్ రేంజి అధికారిణి కళావతి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్‌వో నితిన్‌కుమార్ ఆదేశాల మేరకు సిద్దవటం రేంజిలోని అన్ని ఫారెస్ట్ బీట్లలో నీటికొరత, ఆహారం కొరతను కొంతవరకు తగ్గించేందుకు 200కు పైగా సాల్ట్ లింకులను (ఉప్పు గడ్డలు) ఏర్పాటు చేశామన్నారు. ఈ ఉప్పు గడ్డల్లో మినరల్ ఉండడం వల్ల వాటిని వన్యప్రాణులు నాకితే వాటికి కావాల్సిన మినరల్ అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఓబులేశు, ఎఫ్ఎస్‌వో సురేష్‌బాబు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోడూరు గంగమ్మతల్లి ఆలయ ధర్మకర్త ఇక లేరు



కుమార్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్ (ఇన్‌సెట్) మృతుడు చెన్నంశెట్టి కుమార్ (ఫైల్)

రైల్వేకోడూరు, మార్చి 27:(ఆంధ్రజ్యోతి): కొత్తకోడూరు గంగమ్మతల్లి ఆలయ ధర్మకర్త చెన్నంశెట్టి కుమార్ (33) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. రైల్వేకోడూరు పట్టణంలోని బలిజపల్లె గంగమ్మతల్లికి పొంగుబాళ్ల కార్యక్రమంలో భాగంగా కుమార్ డప్పు వాయించాడు. అనంతరం అమ్మవారిని ఊరేగిస్తూ గంగమ్మ ఆలయం దాటుకుని వెళుతుండగా తనకు ఛాతీలో నొప్పి వస్తుందని సహచరులకు తెలిపాడు. దీంతో కుమార్ ను హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా కుమార్ చిన్న వయస్సులోనే కొత్తకోడూరులో గంగమ్మ తల్లి ఆలయాన్ని ప్రజల సహకారంతో నిర్మించాడు. ప్రతి ఏటా రైల్వేకోడూరు జాతర పూర్తికాగానే కొత్తకోడూరు గంగమ్మ జాతర నిర్వహించి ప్రజలందరికీ చేరువయ్యాడు.కుమార్ మృతితో ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన నాయకులు కుమార్ మృతదేహానికి పూలమాలలు వేసి ని వాళులర్పించారు.ఆయన్ను కొత్తకోడూరులో ఖననం చేశారు.

నేడు ఇఫ్తార్ విందు

రాయచోటిటౌన్, మార్చి27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కలెక్టర్ ఆదేశాలతో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 28న సాయంత్రం 5.30 గంటలకు ఇఫ్తార్ విందు ఉంటుందని అన్నమయ్య జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్.ఇమ్రాన్ గురువారం ఇక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలోని ఫ్రూట్స్ మండీల వద్ద ఈ విందు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కావున అందరూ హాజరు కావాలని కోరారు.

వైభవంగా ఒంటిమిట్ట గంగమ్మ జాతర



ఒంటిమిట్ట: ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



రైల్వేకోడూరు: అమ్మవారి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

ఒంటిమిట్ట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలో గురువారం గంగమ్మ దేవత జాతర వైభవంగా జరిగింది. వేకువజామునే దిగువ వీధిలో గంగమ్మ దేవతను ప్రతిష్ఠించి తప్పెట్ల వాయిద్యాల మధ్య బాణసంచా పేల్చుతూ అమ్మవారిని గుడిలో నిలిపారు. ఈ ఊరేగింపులో మహిళలు అమ్మవారికి బోనాలు పెట్టగా భక్తులు జంతుబలులు ఇచ్చారు. గురువారం సాయంత్రం మొక్కుబడి కలిగిన మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఒంటిమిట్ట చెంచుగారిపల్లె, పెద్దకొత్తపల్లె తదితర గ్రామాల నుంచి కూడా వందలాది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. నడింపల్లె గ్రామంలో కూడా జాతర నిర్వహించారు. సాయంత్రం వచ్చిన పందారపు బండ్లు ప్రజలను విశేషంగా అలరించాయి. రాత్రి ఆసాది కథ జరిగింది. జాతర సందర్భంగా సీఐ బాబు, ఎస్ఐ శివప్రసాద్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బలిజపల్లె గంగమ్మకు వైభవంగా పొంగుబాళ్లు

రైల్వేకోడూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధానదారి పక్కన వెలసిన బలిజపల్లె గంగమ్మకు గురువారం పొంగుబాళ్ల కార్యక్రమం వైభవంగా జరిగింది. గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకుని పొం గుబాళ్లు పెట్టుకున్నారు. రైల్వేకోడూరు సీఐ కే.హేమసుందరరావు, ఎస్ఐ నవీన్‌బాబు బందోబస్తు నిర్వహించారు.

గోపవరంలో హైటెన్షన్

- ఉత్కంఠగా మారిన ఉపసర్పంచ్ ఎన్నిక
- ఇరు పార్టీల బలప్రదర్శన
- వైసీపీ వార్డు మెంబర్లు హాజరు కాకుండా అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- రాళ్లదాడి - పోలీసుల స్వల్ప లాఠీఛార్జి
- కోరం లేక ఎన్నిక వాయిదా


గోపవరం పంచాయతీ కేంద్రం వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు, డీఎస్పీ భావన


ఎన్నిక కేంద్ర సమీపంలో మోహరించిన పార్టీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ఉత్కంఠంగా మారింది. వైసీపీ వార్డు మెంబర్లను ఎన్నిక కేంద్రానికి వెళ్లనివ్వకుండా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైసీపీ వార్డు మెంబర్ల వాహనాలపై రాళ్ల దాడి చేయడంతో వాహన డ్రైవరు, వార్డు మెంబర్లకు స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నంలో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేశారు. వివరాలిలా..

గోపవరం పంచాయతీలో మొత్తం 20 మంది వార్డు మెంబర్లలో 14 మంది వైసీపీకి ఉండగా ఆరుగురు టీడీపీ వైపు ఉన్నారు. ఉపసర్పంచ్ పదవిని తమ ఖాతాలోకి వేసుకునేందుకు టీడీపీ పావులు కదిపింది. గోపవరం ఉపసర్పంచ్ పదవిలో రెండున్నర సంవత్సరం ఓసీ అభ్యర్థిని మరో రెండున్నర సంవత్సరం బీసీ అభ్యర్థిని ఉపసర్పంచ్‌గా నిలబెడుతానని అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాట ఇచ్చారు. ఒప్పందం మేరకు కాల పరిమితి పూర్తి అయిన అనంతరం ఉపసర్పంచ్ బీరం రాఘవేంద్రారెడ్డి రాజీనామాచేశారు. ఎన్నికల నోటిఫికేషన్ ఆలస్యం కావడం, ప్రభుత్వం మారడం, కొంతమంది వైసీపీ వార్డు మెంబర్లు టీడీపీలోకి చేరడంతో గత ఎమ్మెల్యే బీసీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారు. దీంతో రాజీనామా చేసిన ఉపసర్పంచ్ బీరం రాఘవేంద్రారెడ్డిని మళ్లీ బరిలోకి దింపడం.. వైసీపీ వార్డు మెంబర్లతో క్యాంపు రాజకీయాలు నడిచాయి. ఈ నేపథ్యంలో ఆరుగురు టీడీపీలోకి చేరారు. ఉప సర్పంచ్ పదవిని తమ ఖాతాలోకి వేసుకునేందుకు ఆ పార్టీ నేతలు ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఎన్నిక సందర్భంగా గురువారం ఉదయం ఎన్నిక కేంద్రం వద్దకు వచ్చిన బీరం రాఘవేంద్రారెడ్డి, పవన్‌కుమార్‌పై టీడీపీ శ్రేణులుదాడికి పాల్పడారు. వీరి నుంచి తప్పించుకుని ఇరువురు ఎన్నిక కేంద్రమైన గోపవరం పంచాయతీ కార్యాలయంలోకి చేరుకున్నారు. అప్పటికే టీడీపీకి చెందిన ఆరుగురు వార్డు సభ్యులు ఎన్నిక కేంద్రంలో ఉన్నారు. మిగిలిన 12 మంది వైసీపీ వార్డు మెంబర్లు వాహనాల్లో ఎన్నిక కేంద్రానికి వెళ్లడానికి ప్రయత్నించగా టీడీపీ శ్రేణులు అడ్డుకుని దాడికి యత్నించారు. దీంతో వారు వెనుతిరిగారు. ఇలా రెండు మూడు సార్లు ఎన్నిక కేంద్రానికి వైసీపీ వార్డు మెంబర్లు హాజరయ్యేందుకు ప్రయత్నించగా వారి వాహనాలపై రాళ్లదాడి జరిగింది. పోలీసులు లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపు చేశారు.

నకిలీలతో కోరం చూపించే యత్నం

గోపవరం ఉప సర్పంచ్ ఎన్నికల్లో మొత్తం 20 మంది వార్డు మెంబర్లు ఉన్నారు. వీరిలో టీడీపీకి చెందిన ఆరుగురు ఎన్నిక కేంద్రానికి హాజరయ్యారు. వైసీపీకి చెందిన ఉపసర్పంచ్ అభ్యర్థి బీరం రాఘవేంద్రారెడ్డి, పవన్‌కుమార్‌లు టీడీపీ శ్రేణుల నుంచి తప్పించుకుని లోనికి ప్రవేశించారు. అప్పటికి మొత్తం ఎనిమిది మంది వార్డు సభ్యులు లోపల ఉన్నారు. మిగిలిన వార్డు మెంబర్లను ఎన్నికకు హాజరుకాకుండా ఎక్కడికక్కడ అడ్డుకోవడంతో బయట ఉద్రిక్తత నెలకొంది. ఎన్నిక కొనసాగాలంటే 11 మందితో కోరం ఉండాలి. దీంతో 10వ వార్డు మెంబరు కందుల బీబీ, 9వ వార్డు అభ్యర్థి షేక్ ఖాదర్‌బాష, 4వ వార్డు మెంబరు కేశవస్థానంలో వారి పేర్లతో ముగ్గురు నకిలీలు ఎన్నిక కేంద్రానికి చేరుకున్నారు. వీరిని గోపవరం మూడవ గ్రామ సచివాలయ కార్యదర్శి ఈశ్వరి పరిశీలించి నకిలీలుగా గుర్తించారు. అయినప్పటికి అధికార బలంతో ఎన్నిక కేంద్రంలోకి ఆముగ్గురు చొరబడ్డారు. లోన ఉన్న వైసీపీ అభ్యర్థులు రాఘవేంద్రారెడ్డి వారు నిజమైన అభ్యర్థులు కారని, నకిలీలు అని వాదించారు. దీంతో అధికారులు వారిని బయటికి పంపించారు. ఎన్నిక సమయం గడువు ముగియడం, సభ్యులు హాజరుకాకపోవడంతో కోరం లేదని ఎన్నిక నిర్వహణ అధికారి, మండల ఈవోపీఆర్‌డీ రామాంజనేయులరెడ్డి ఎన్నికను వాయిదా వేసి పంచాయతీ కార్యదర్శితో కలిసి పోలీసు బందోబస్తుతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఎన్నిక వాయిదా పడకుండా కొంతమంది టీడీపీ నాయకులు ఎన్నిక కేంద్రం వద్దకు చేరుకుని విశ్వప్రయత్నాలు చేశారు. మరోవైపు కొర్రపాడు రోడ్డులో మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, మండల వైస్‌చైర్మన్ బంగారురెడ్డి, వైసీపీ నాయకులు తమ వర్గీయులతో మోహరించారు. వారి వద్ద ఉన్న 12 మంది అసలైన వార్డు మెంబర్ల వీడియోలను తీసి జిల్లా ఉన్నతాధికారులకు పంపించి ఇక్కడ జరిగే ఎన్నిక వాయిదా వేయడంపై అభ్యంతరం తెలిపారు. ఎన్నిక కేంద్రంవద్ద నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు ఎన్నిక కేంద్రానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. డీఎస్పీ భావన, సీఐలు శివరాముడు, రామక్రిష్ణ, బాలమద్దిలేటి, ఎస్‌ఐలు ధనుంజయుడు, శ్రీనివాసులు, మహమ్మద్‌రఫీ, మరో 50 మంది పోలీసులు ఎన్నిక బందోబస్తులో పాల్గొని ఎప్పటికప్పుడు పరిస్థితిని సద్దుమనిగేలా చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు ఉపసర్పంచు ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేస్తూ ఎన్నికల నిర్వహణ అధికారి ప్రకటించారు. తదనంతరం టీడీపీ వార్డు మెంబర్లు అక్కడి నుంచి వెళ్లిపోగా వైసీపీ వార్డు మెంబర్లు రాఘవేంద్రారెడ్డి, పవన్‌కుమార్‌లను పోలీసు బందోబస్తుతో వారి ఇళ్లవద్దకు చేర్చారు.

'గండి'లో హుండీ లెక్కింపు.. రూ.7లక్షలు ఆదాయం


గండి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

చక్రాయపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం కమిషనరు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. 45 రోజులకు గాను భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.7,07,750 ఆదాయం వచ్చింది. అలాగే నిత్యాన్నదాన పథకానికి రూ.14,407 ఆదాయం వచ్చింది. కాగా, కూరగాయల టెండర్లకు వేలం నిర్వహించగా ఎక్కువ మంది పోటీ పడటంతో ప్రస్తుతానికి రద్దు చేశారు. కార్యక్రమంలో గండి దేవస్థాన చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, మెంబరు వెంకట్రామిరెడ్డి, ఆలయ సిబ్బంది, ట్రిబుల్‌ఐటీ విద్యార్థులు, బ్యాంకు అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు క్యాంపస్ ఉద్యోగాలు


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టరు కుమారస్వామి గుప్త, తదితరులు

వేంపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ సీఎస్‌సీ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు లభించాయి. హైదరాబాదుకు చెందిన పోసిడెక్స్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఇందులో 9మంది విద్యార్థులు రూ.6లక్షల వార్షిక వేతనానికి ఎంపికైనట్లు డైరెక్టరు కుమారస్వామి గుప్త, ఏవో పెనుగొండ రవికుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ప్లేస్‌మెంటు కోఆర్డినేటరు వినోద్, ప్లేస్‌మెంటు ఆఫీసరు సుందర్‌లను అభినందించారు.

అదనపు నిధులను సద్వినియోగం చేసుకోండి

- హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు వెల్లడి

పెద్దతిప్పసముద్రం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో గృహ నిర్మాణ పనులను చేపట్టి ప్రభుత్వం అందించే సొమ్ము గృహాలకు చాలీచాలని పరిస్థితిలో నిర్మాణాలను చేపట్టలేక లబ్ధిదారులు నిలిపేసిన వారికి ప్రభుత్వం ఓ చక్కని అవకాశం కల్పించందని హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు వెల్లడించారు. గురువారం ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్‌తో కలసి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంటుతో సమావేశమై మాట్లాడుతూ గృహనిర్మాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అధనంగా నిధులను మంజూరు చేసిందన్నారు. మొత్తం 477 మంది లబ్ధిదారుల్లో ఇప్పటికే అదనపు నిధులు 250 మందికి నేరుగా వారి ఖాతాలకే జమ చేయబడ్డాయన్నారు. ఈ నిధులను గృహనిర్మాణాలకే వినియోగించుకోవాలన్నారు.

టీడీపీ నేతల పరస్పర ఫిర్యాదు

నిమ్మనపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువురు టీడీపీ నేతలు పనుల విషయమై ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. గురువారం మండల అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలో లేని సమయంలో క్రమం తప్పకుండా తాము అన్ని కార్యక్రమాలు చేపట్టామని, ఎప్పుడూ ఒక్క కార్యక్రమానికీ రాని మహేష్ టీడీపీ అధికారంలోకి రాగానే పెత్తనం చెలాయిస్తూ తమపైనే దౌర్జన్యం చేస్తున్నాడని ఆరోపించారు. మహేష్ మాట్లాడుతూ.. వెంకరమణ చేసే పనుల గురించి ప్రశ్నించినందుకు తనను బస్టాండు సమీపంలో రాళ్లతో దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై పోలీసులను వివరణ కోరగా టీడీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటి వరకు ఎలాంటి చర్య తీసుకోలేదని తెలిపారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

కలకడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ సాంబశివయ్య సూచించారు. బాటవారిపల్లె పంచాయతీలోని లే అవుట్‌ను సందర్శించి పురోగతిని పరిశీలించారు. మే ఆఖరులోగా ఇళ్లను పూర్తి చేసి లబ్ధిపొందాలని సూచిం చారు. కార్యక్రమంలో ఏఈ నాగమునినాయక్, ఈఏ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మైదుకూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో నంద్యాల రోడ్డులోని మహబూబ్‌నగర్‌లో నివశిస్తున్న గోర్ల పాపయ్యగారి సుబ్బలక్షుమ్మ (49) అనే మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. సుబ్బలక్షుమ్మ గత శుక్రవారం రాత్రి తన కుమార్తెతో కలిసి ఇంటిపై నిద్రిస్తుండగా అర్ధరాత్రి కాలకృత్యాల కోసం కిందకు వస్తుండగా ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారి పడింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మరణించినట్లు ఆమె బంధువులు తెలిపారు. సుబ్బలక్షుమ్మకు భర్త, ముగ్గురు కుమార్తెలు కాగా, ఒక కుమార్తెకు వివాహమైంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..


సంఘటనా స్థలంలో డోలా సతీష్ మృతదేహం

రైల్వేకోడూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరాజుపురం పంచాయతీ గంగరాజుపురం ప్రధాన జాతీయ రహదారిపై గురువారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు రాఘవరాజుపురం పంచాయతీ హరిజనవాడకు చెందిన దివ్యాంగుడు డోలా సతీష్ (38)గా గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహన్ని శవ పరీక్ష నిమిత్తం కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కోడూరు ఎస్‌ఐ నవీన్ బాబు తెలిపారు.

లారీ బోల్తా - ఒకరి మృతి

బోల్తాపడిన లారీ



ఖాజీపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు సమీపంలో లారీ బోల్తాపడిన సంఘటనలో డ్రైవర్‌మాబూసాహెబ్(47) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మైదుకూరు నుంచి కడపవైపు వెళుతున్న లారీ పత్తూరు సమీపంలోకి రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో బోల్తాపడింది. దీంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని శవపరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మృతుడు మాబూసాబ్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలి

- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్

కడప రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025 ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయ విధానాలను సమర్థవంతంగా అమలు చేసి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందికి శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ ద్వారా సిబ్బందికి అవసరమైన నైపుణ్యాలను అందిస్తున్నామన్నారు. పకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించడంలో ఈ శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. జిల్లాలోని వ్యవసాయ సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు, ప్రీ-మాన్సూన్ డ్రైసోయింగ్, స్వయం సహాయక సంఘాల ద్వారా రైతుల సాధికారత వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. హార్టికల్చర్ అధికారి సిందూరి ఆ శాఖ ద్వారా అందిస్తున్న వివిధ రకాల సబ్సిడీల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు పీడీఎం వసంతకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జడ్‌హెచ్‌డీసీ భూముల పరిశీలన


జడ్‌హెచ్‌డీసీ భూములపై విచారణ చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి

రాజంపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం తాళ్లపాక గ్రామ పరిధిలోని జడ్‌హెచ్‌డీసీ భూములను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా 1984లో సుమారు 50 మంది ఎస్సీలకు ఇచ్చిన భూములను పరిశీలించారు. ఎస్సీల కోసం కోళ్లఫారాల పరిశ్రమల అభివృద్ధి కోసం ఈ భూములను ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఈ భూములను సక్రమంగా వినియోగించుకోలేదని, ఇతరులు ఆక్రమించారని ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ ప్రాంతంలో ఆలయాన్ని కూడా నిర్మిస్తున్నారని ఈ అంశాలపై తాము విచారణ చేస్తున్నామన్నారు. ఎస్సీలకు కేటాయించిన ఈ భూముల్లో ఎటువంటి ఆక్రమణలు జరిగినా తహశీల్దారుతో సర్వే చేయించి కలెక్టర్‌కు నివేదిక పంపి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ఇరువురు గంజాయి విక్రేతల అరెస్టు

కడప క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పాత బైపాస్‌లోని సంజన్న సర్కిల్ వద్ద గంజాయి అమ్ముతున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు కడప ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్ తెలిపారు. కడపకు చెందిన దూదేకుల సిద్దు, తాటి నాగసురేశ్ కుమార్‌లు ద్విచక్ర వాహ నంలో సంజన్న సర్కిల్ వద్దకు వచ్చి గంజాయి విక్రయిస్తు న్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి సిబ్బందితో దాడి చేసి వారిని అరెస్టు చేసి 1250 గ్రాములు గంజాయిని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో వ్యక్తి గిద్దలూరుకు చెందిన దాసరిగాని పరారయ్యాడని.. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పట్టుబడిన ఇరువురిని రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

నిందితుడు రిమాండ్‌కు తరలింపు

మదనపల్లెఅర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు తలలను బండరాయితో పగలకొట్టిన కేసులో చిప్పిలి వాసి షేక్ మొహమ్మద్ అలీ అలియాస్ లడ్డు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ పేర్కొన్నారు. 24న సాయంత్రం మదనపల్లి మండలం పొన్నేటి పాలెం పంచాయతీ బెంగళూరు మెయిన్ రోడ్‌లో ఘటన జరిగింది. సీఐ మాట్లాడుతూ షేక్ మహమ్మద్ అలీ పాత నేరస్థుడని గతంలో జైలుకు వెళ్లొచ్చాడని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు


పెద్దపీరయ్యస్వామి జీవ సమాధి ఫొటో

బ్రహ్మంగారిమఠం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి శిష్యుడు సిద్దయ్యస్వామి కుమారుడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు ఈనెల 30, 31 తేదీలలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠాధిపతి కలుగోట్ల సిద్దయ్య తెలిపారు. గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఆరాధనోత్సవాల సందర్భంగా 30న ఆదివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు రాత్రి గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులకు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో యాదవ అన్నసత్రంలో అన్నదాన కార్యక్రమం, రాత్రి 10గంటలకు గోపాల్ బృందం వారిచే రేలారే రేలా కార్యక్రమం, సీనీ ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు. అలాగే బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటకం, పట్టాభిస్వామి కోలాటం ఉంటుంది. 31న చిన్న, పెద్ద వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళా క్రికెట్‌లో రాణిస్తున్న శ్రీచరణి

- బీసీసీఐ సీనియర్ మహిళా చాలెంజర్స్ ట్రోఫీలో ప్రతిభ
- తొలిరోజే మల్టీడేస్ మ్యాచ్‌లో 6 వికెట్ల కైవసం



కడపస్పోర్ట్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన మహిళా క్రీడాకారిణి ఎన్.శ్రీచరణి బీసీసీఐ సీనియర్ మహిళా చాలెంజర్స్ ట్రోఫీలో రాణించారు. డెహ్రాడూన్ రాజీవ్ గాంధీ ఇంటర్‌నేషనల్ స్టేడియంలో నిర్వహించిన బీసీసీఐ సీనియర్ ఉమెన్స్ చాలెంజర్స్ ట్రోఫీలో యర్ర గుంట్ల మండలం యర్రంపల్లెకు చెందిన నల్లపురెడ్డి శ్రీచరణి ఏకంగా 6 వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టును కోలుకోలేని దెబ్బతీశారు. అక్కడి మల్టీడేస్ మ్యాచ్‌లో టీం-ఎ, టీం-బీ జట్లు తలపడగా టీం-బీ జట్టుకు శ్రీచరణి ప్రాతినిధ్యం వహిస్తూ వేసిన 32 ఓవర్లలో 8 మెయిడిన్ ఓవర్లతో పాటుగా 6 వికెట్లు సాధించారు. కాగా జిల్లాకు చెందిన శ్రీచరణి జాతీయ స్థాయిలో సత్తా చాటుతుండడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ అభినందనలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


భరత్ మృతదేహం, భరత్ (ఫైల్)

తంబళ్లపల్లె, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావిలో పడి ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం తంబళ్లపల్లె మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యుల వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండల కేంద్రం తూర్పు హరిజనవాడకు చెందిన జి.వెంకట్రమణ కుమారుడు భరత్(27) బుధవారం మధ్యాహ్నం స్నేహితులతో కలసి బయటకు వెళ్లా డు. తంబళ్లపల్లెకు సమీపంలోని రేణుమాను బావి గట్టు మీద కూర్చుని స్నేహితులతో కలసి మద్యం సేవించారు. అర్ధరాత్రైనా భరత్ ఇంటికి రాకపోవడం, ఫోన్ తీయకపోవడంతో కంగారు పడిన తల్లితండ్రులు.. బంధువుల ఇళ్లతో పాటు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. చివరికి రేణుమాను బావి వద్ద వెతకడంతో గట్టు మీద మృతుడి చెప్పులు, సెల్‌ఫోన్ లభ్యమయ్యాయి. దీంతో భరత్ బావిలో పడిపోయాడనే అనుమానంతో తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఉదయం ఎస్‌ఐ లోకేష్ రెడ్డి, సిబ్బంది బావి వద్దకు చేరుకుని స్థానికులు, మృతుడి కుటుంబసభ్యుల సహాయంతో పాతాలభైరవి, నీటి కెమెరాలతో బావిలో తీవ్రంగా గాలించారు. బావి పెద్దదిగా ఉండటం, అందులోని నీళ్లు ఎక్కువగా పాచి పట్టి ఉండటంతో ఎంత శ్రమించినా మృతుడి ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో సాయంత్రం 6 గంటల సమయంలో మృతుడు భరత్ బావిలో శవమై పైకి తేలాడు. ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానికుల సహాయంతో వెలికితీయించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, భరత్ ఓ ప్రవేటు బస్సులో కండక్టర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉన్నాడు. చేతికి అంది వచ్చిన కొడుకు మృతిచెందడంతో తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమ కొడుకు మృతిపై అనుమానాలున్నాయని పోలీసులు సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని భరత్ తల్లితండ్రులు, కుటుంబసభ్యులు కోరుతున్నారు.

వైభవంగా గుంటిగంగమ్మ జాతర


విశేష పూజలందుకుంటున్న గుంటి గంగమ్మ దేవత

వాల్మీకిపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చింతపర్తి గ్రామం బాహుదానది ఒడ్డున వెలసిన గుంటిగంగమ్మ దేవత అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, విశేషాలంకరణల నడుమ ప్రత్యేక పూజలు జరిగాయి. జాతర సందర్భంగా సమీప గ్రామాల నుంచి మహిళలు భారీ ఎత్తున దీలు బోణాలతో ప్రదర్శనగా వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పుష్ప పల్లకిలో అమ్మవారిని పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి నుంచి చాందినీ బండ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి. సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ చంద్రశేఖర్ వందమంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేసి పర్యవేక్షిస్తున్నారు. డీజే నృత్యాలు పూర్తిగా నిషేధించ డంతో భక్తిభావంతో జాతర మహోత్సవాలు జరుగుతున్నాయి. ఆలయం వద్ద భక్తు లకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానాలు చేపట్టారు. ఉత్సవ నిర్వాహకులు బాబు రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నడివీధి గంగమ్మ జాతర


పురవీధుల్లో నడివీధి గంగమ్మ ఊరేగింపు

పెద్దతిప్పసముద్రం మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సంతబజారులో రెండు రోజులుగా జరిగిన నడివీధి గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి అమ్మవారిని ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. బుధవారం పగలు భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆసాదుల భక్తి పాటలతో అమ్మవారి చరిత్రను వివరించారు. బుధవారం రాత్రి అమ్మవారు పురవీధుల్లో ఊరేగారు. గంగమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు గట్టి పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. గంగజాతర ప్రశాంతంగా ముగియడంతో పీటీఎం ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ముదివేడుకు రూ5.60లక్షల ఆదాయం


వారపుసంతకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

కురబలకోట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వారపు సంతకు నిర్వహించిన వేలంలో ముదివేడుకు రూ5.60లక్షల ఆదాయం దక్కింది. పంచాయతీ కార్యాలయంలో గురువారం వారపు సంతకు వేలం నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదాయం వచ్చింది. వారపు సంతకు రూ.50వేలు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. కాగా గతేడాది ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో తొమ్మిది నెలలకు వేలం నిర్వహించారు. గతేడాది రూ.3.50 లక్షలు పలకగా, ప్రస్తుతం ఏడాదికి నిర్వహించిన వేలంలో రూ.5.60 లక్షలతో ముదివేడు వాసి నౌషాద్ దక్కించుకున్నారు. డీఎల్‌డీఓ నాగరాజ, ఎంపీడీఓ గంగయ్య, పంచాయతీ కార్యదర్శి నరసింహా, అఫ్జల్ పాల్గొన్నారు.

ఆక్రమణలపై బాధితుల నిరసన


బీకేపల్లె స్థలం వద్ద నిరసన తెలుపుతున్న రజక సంఘం సభ్యులు

మదనపల్లె టౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బీకేపల్లె రెవెన్యూ గ్రామంలో రజకులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను కొందరు ఆక్రమించేందుకు యత్నించడం, సిమెంటు దిమ్మెలు ధ్వంసం చేయడంపై రజకులు ఆందోళనకు దిగారు. గురువారం బీకేపల్లె కాలనీ సర్వే నెంబర్ 513లో రజకుల ఇళ్ల స్థలాలకు కేటాయించిన 1.72 సెంట్ల స్థలం చుట్టూ వేసిన సిమెంటు దిమ్మెలు, కంచెను కొందరు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న శ్రీవేంకటేశ్వర రజక సంఘం నేతలు అక్కడికి చేరుకుని అభ్యంతరం తెలపగా వారిని కులం పేరుతో దూషిస్తూ దౌర్జన్యం చేశారు. దీంతో సంఘటనా స్థలం వద్దే నిరసనకు దిగిన బాధితులు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా తమకు కేటాయించిన స్థలం తమ అధీనంలోనే వుందని, కోర్టులో కూడా తమకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సహాయ, సహకారాలతో ఈ స్థలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు తాము సిద్ధం అవుతుంటే కొందరు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలం రికార్డులు పరిశీలించి రజకులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే తహసీల్దార్‌ను ఆదేశించారన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నేతలు ఎం.నాగయ్య, వెంకటరమణ, రామ్మూర్తి, మునిరత్నం, హరికృష్ణ, అరుణ, మంజుల, సుజాత, నందిని పాల్గొన్నారు.

రామకృష్ణ కుటుంబానికి అండగా ఉంటాం


నివాళులర్పిస్తున్న జగన్‌మోహన్‌రాజు

మదనపల్లె టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురంలో హత్యకు గురైన టీడీపీ కార్యకర్త కాగితి రామకృష్ణనాయుడు కుటుంబానికి తాము అండగా వుంటామని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హామీ ఇచ్చారు. గురువారం రామకృష్ణ దశదినకర్మలో పాల్గొన్న వారు మాట్లాడుతూ రామకృష్ణ మృతితో ఆయన కుటుంబానికి లోటు లేకుండా చేయడానికి టీడీపీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లానన్నారు. రామకృష్ణ కుమారుడికి ఉద్యోగం ఇప్పించి స్థిరపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. రామకృష్ణ భార్య ఉమాదేవి పేరిట వలసపల్లె పంచాయతీ నవోదయ కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేయిస్తానని, ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చులు తాను భరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దొరస్వామినాయుడు, నాదెళ్ల శివన్న, ఎం.నాగయ్య, రఘుపతినాయుడు, మురళి పాల్గొన్నారు.

ప్రజావసరాల కోసం ప్రైవేటు స్థలం ఇవ్వండి


కోటారుపల్లె తండాకు వెళ్లే రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామ ప్రజల కోసం అవసరమైన ప్రైవేటు స్థలం ఇచ్చి సహకరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కోరారు. గురువారం కోటవారుపల్లె తండాకు వెళ్లే రోడ్డును ఎమ్మెల్యే పరిశీలించారు. గిరిజనులు మాట్లాడుతూ ప్రధాన రహదారికి వెళ్లే ఈ రోడ్డులో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులకు చెందిన 24 సెంట్ల స్థలం వుందని, ఈ స్థలాన్ని రోడ్డుకు అప్పగించాలని 20 ఏళ్లుగా రైతులను అడుగుతూనే వున్నామన్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రైతుల నుంచి కంపల్సరీ ఎల్‌ఏ చట్టాన్ని ఉపయోగించి ఈ స్థలం తీసుకునే అవకాశమై రెవెన్యూ అధికారులు పరిశీలించాలన్నారు.


రోడ్డు పక్కనే డంప్ చేసిన చెత్త

‘చెత్త నుంచి సంపద సృష్టి’కి ఆచరణ శూన్యం

ప్రజాధనం చెత్తపాలు ● ఊరి ముందే వెలుస్తున్న దిబ్బలు

రామసముద్రం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రప్రదేశ్ పేరిట పట్టణాలు, గ్రామాల్లో శుభ్రత పాటించాలని చేపడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు కార్యరూపం దాల్చడంలో కుంటుపడుతున్నాయి. స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు, ర్యాలీలు, ఫొటో ఫోజులు, ప్రకటనలకే పరిమితమవడంతో ప్రజాధనం వృథా అవుతోంది. చెత్తను తొలగిస్తూ సంపదను సృష్టించాల ని ద్విముఖ వ్యూహంతో మండలంలో ఉపాధి కింద పంచాయతీకి ఒకటి చొప్పున 15 సృష్టి కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పంచాయతీ కేంద్రానికి సుమారు రూ.4లక్షలు, మండల కేంద్రంలోని కేంద్రానికి రూ.8లక్షలు ఖర్చు చేశారు. ఇందులో 20కి పైగా నడాన్ వర్మీ కంపోస్టు తొట్టెలు, 12 పెద్ద తొట్టెలు ఏర్పాటు చేశారు. వీటికి పెద్దమొత్తంలో నిధులు ఖర్చు చేసినా చివరికి కేవలం నాలుగు తొట్టెల్లో మాత్రమే వర్మీ కంపోస్టు ఎరువు తయా రవుతోంది. దీనికి తోడు నెల జీతం ఇస్తూ షెడ్లకు కాపలాదారుడిని కేటాయించినా ఆయన ఏ రోజూ కనిపించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సేకరించిన చెత్తను కేంద్రాలకు తరలించడంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్య ధోరణితోనే ఈ కేంద్రాలు నిరుపయోగం అవుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. చెత్త తరలించడానికి ఉపయోగించే త్రిచక్ర వాహనాలు పంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట మూలన పడ్డాయి. సేకరించిన చెత్తను రోడ్ల పక్కన, చెరువుల్లో డంప్ చేస్తున్నారు. దీంతో కుళ్లిన చెత్త దుర్గంధంగా మారి అనారోగ్యానికి కారణమవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క ప్రజల ఆరోగ్యం కాపాడుతూ మరో పక్క చెత్తతో సంపద సృష్టించాలన్న ఆలోచనతో ప్రభుత్వం రూ.లక్షల నిధులు ఖర్చు చేసి సంపద సృష్టి కేంద్రాలు ఏర్పాటు చేస్తే అధికారుల నిర్లక్ష్యంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సేకరించిన చెత్తను షెడ్లకు తరలించి సద్వినియోగం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


రెండు తొట్టెల్లోనే వర్మీకంపోస్టు తయారీ




ఖాళీగా ఉన్న నాడాన్ తొట్టెలు


ఖాళీగా ఉన్న వర్మీ కంపోస్టు తొట్టెలు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పురుషోత్తం రెడ్డి


పురుషోత్తం రెడ్డి | ఆర్.చంద్రశేఖర్ | రామస్వామి రెడ్డి | షౌకత్ అలీ

పీలేరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పీలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బీసీ పురుషోత్తం రెడ్డి ఎన్నికయ్యారు. పీలేరు కోర్టు ప్రాంగణలో గురువారం జరిగిన ఎన్నికల్లో ఆయన తన ప్రత్యర్థి రఫీ అన్సారీపై 18 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఆర్.చంద్రశేఖర్ తన ప్రత్యర్థి నరసింహారెడ్డిపై 20 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా కె.రామస్వామి రెడ్డి తన ప్రత్యర్థి తెనాలి రామసుబ్రహ్మణ్యంపై 13 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. మొత్తం 76 మంది ఉన్న అసోసియేషన్‌లో గురువారం 74 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్ష పదవుల కోసం పోటీ ఏర్పడడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. అంతకుమునుపు కోశాధికారిగా షౌకత్ అలీ, సంయుక్త కార్యదర్శిగా వై.నాగసుధాకర్ రెడ్డి, క్రీడా విభాగం కార్యదర్శిగా ఎస్.నిరంజన్ కుమార్, గ్రంథాలయ కార్యదర్శిగా పూజారి ఎల్లప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి న్యాయవాదుల సంఘం శుభాకాంక్షలు తెలిపింది.

ఘనంగా జనసేన నేత జన్మదిన వేడుకలు


గంగారపు రామ్‌దాస్‌చౌదరికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న బసినికొండ టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి, తదితరులు

మదనపల్లె, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన నివాసంలో గురువారం పార్టీశ్రేణులు, నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకుని రామ్‌దాస్‌చౌదరికి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్ రాయల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి, కొప్పూరి మల్లికార్జున నాయుడు, బసినికొండ జనసేన నేత పులగంటి నాగేంద్ర, టీడీపీ నేతలు ఆర్.వెంకటరమణనాయుడు, కంచెర్ల రంగస్వామినాయుడు, నారాయణస్వామి, గంగమ్మగుడి నారాయణస్వామి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కోళ్లబైలు-1 పంచాయతీ వైఎస్ఆర్ కాలనీలో రాజారెడ్డి ఆధ్వర్యంలో గంగమ్మగుడిలో పూజలు చేసి కేక్ కట్ చేసి, కార్యకర్తలకు పంచిపెట్టారు. పట్టణ కార్యదర్శి జనార్దన్, నేతలు జంగాల శివరాం, గిరీష్‌కుమార్, బండి మనోహర్, గజ్జల రెడ్డెప్ప, శంకర్, రాఘవరెడ్డి, రవి, పురుషోత్తం, మనోహర్, సుబ్బారెడి పాల్గొన్నారు. రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె మండలాల్లో పార్టీ శ్రేణులు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మూగజీవాలకు దాహార్తి తీర్చాలి


పక్షుల దాహార్తి తీర్చడానికి సిద్ధం చేసిన బౌల్స్

మదనపల్లె అర్బన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాల్లో మూగజీవాలకు దాహార్తి తీర్చడానికి స్థానిక హెల్పింగ్ మైండ్స్ సంస్థ సిమెంట్‌తో తయారైన వాటర్ బౌల్స్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్ధిక్ తెలిపారు. వేసవి వచ్చిందంటే నీటి చుక్క కోసం అల్లాడిపోతాం. మూగజీవాలైన పక్షులు వేడి తాపాన్ని చల్లగా చేసుకోవడానికి, తాగడానికి మట్టి, సిమెంట్‌తో తయారు చేసిన వాటర్‌బౌల్స్ సంస్థ ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సభ్యులు దినకర్, పురుషోత్తం, బషీర్, కిరణ్, పాల్గొన్నారు.

నేడు బస్టాండ్, సంత వేలం

గుర్రంకొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పంచా యతీ పరిధిలోని ప్రైవేట్ బస్టాండు, వారపు సం త నిర్వహణకు శుక్రవారం వేలం నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీహరి తెలిపారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం 3కు పంచాయతీ కార్యాల యం ఆవరణలో వేలం జరుగుతాయన్నారు.

ఇన్విజిలేటర్లపై చర్యలు సరికావు

పీలేరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్ష ఇన్విజిలేటర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సరికాదని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. పీలేరులో గురువారం ఆయన మాట్లాడుతూ పరీక్షా పత్రాన్ని లీక్ చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకానీ ఇన్విజిలేషన్ చేసే ఉపాధ్యాయులపై కఠినంగా ప్రవర్తించడం సరికాదన్నారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని లేదంటే భవిష్యత్‌లో ఉపాధ్యాయులు ఇన్విజిలేషన్ విధులకు హాజరుకారని స్పష్టం చేశారు. ప్రభుత్వం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు.

నవోదయకు విద్యార్థిని ఎంపిక



వాల్మీకిపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని కార్తీక నవోదయ స్కూల్‌కు ఎంపికైంది. చింతలవారిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థిని ఆరోతరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అర్హత సాధించినట్లు పాఠశాల హెచ్ఎం లక్ష్మీపతి పేర్కొన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

దరఖాస్తు చేసుకోండి

మదనపల్లె టౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెవెన్యూ డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పదవి కోసం దరఖాస్తు చేసుకోవాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ప్రకటించారు. జీఓనెంబర్ 99 ప్రకారం ఈ కమిటీలో ఎస్సీ ఎస్టీ సంఘాల నుంచి ఇద్దరు, ప్రభుత్వేతర వ్యక్తులు ఇద్దరిని కమిటీ సభ్యులుగా నియమిస్తామన్నారు. అర్హులైన, సామాజికస్పృహ కలిగి ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏడు పనిదినాల్లో ఈ దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ఐక్యతకు ప్రతీక ఇఫ్తార్

- టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు విరమించే సమయంలో చేపట్టే ఇఫ్తార్ ఐక్యతకు ప్రతీకని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. చౌడసముద్రం మసీదులో గురువారం సాయంత్రం ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరైన ఆయన మాట్లాడారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు చాంద్‌బాషా, బుర్రా రమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి

మదనపల్లె టౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పథకం కింద మంజూరైన ఫారంపాండ్ల పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరుతో 2025 వార్షిక సంవత్సరం ముగుస్తుందని, ఏప్రిల్ 1వ తేదీ నుంచి రైతులకు ఉపయోగపడేలా పనులను గుర్తించాలన్నారు. ఏపీఓ, టీఏలు, ఎఫ్ఏలు రోజూ క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతి వివరాలను నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ చెన్నకేశవులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

భవనాలు తొలగింపు


భవనాలను తొలగిస్తున్న యంత్రాలు

పీలేరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పీలేరు-మదనపల్లె రోడ్డులోని రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్ఓబీ స్థలంలో ఉన్న పలు భవనాలను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. ఆర్ఓ, రైల్వే లెవెల్ క్రాసింగ్ నిర్మాణం కోసం అదనపు స్థలం అవసరమవడంతో ఆ ప్రాంతంలోని పలు భవనాలను ఖాళీ చేయాల్సిందిగా రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడం, స్థానికులు అభ్యంతరం చెప్పడం, ఆర్డీఓ సందర్శించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో విద్యుత్, ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఎక్కువగా ఉన్న ఓ భవంతిని ఈ నెలాఖరులోపు ఖాళీ చేయాలని ఆర్డీఓ శ్రీనివాసులు రెండు రోజుల కిందట ఆదేశించారు. మిగతా భవనాల కూల్చివేతను గురువారం ఉదయం రెవెన్యూ, పోలీసులు, ఎన్‌హెచ్, ఆర్ఓబీ అధికారులు సంయుక్తంగా చేపట్టారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

పీలేరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఒంటిల్లు గ్రామ టీడీపీ నేత గాలేటి శ్రీధర్ నాయుడు గురువారం గ్రామంలోని ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పవిత్ర రమజాన్ మాసంలోని సతామీ రోజున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం, అందులో ముస్లింలు పెద్దఎత్తున పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని శ్రీధర్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు నరసింహనాయుడు, రోహిత్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్ఆర్ఐ చేయూత

పీలేరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అమెరికాలో స్థిరపడిన పీలేరు వాసి రాజేంద్ర ఆచారి కుమార్తె సుమలత శివరామాపురం ప్రాథమిక పాఠశాలకు క్రీడా, స్టేషనరీ సామగ్రి వితరణగా అందజేశారు. సుమలత ఏబీసీ సంస్థ, డీసీసీబీ బ్యాంకు అప్రైజర్ తండ్రి విద్యార్థులకు సామాగ్రిని అందజేశారు. ఎంఈఓలు లోకేశ్వర రెడ్డి, పద్మావతమ్మ మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడినా పీలేరు విద్యార్థులకు సాయం చేస్తున్న ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. హెచ్ఎంలు శోభారాణి, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు రేఖ, వసంత కుమారి, గీతారాణి, మమత, సీఆర్‌పీలు మురళీధర్ రాజు, మాధవి పాల్గొన్నారు.

కో-ఆప్షన్ సభ్యుడిగా సయ్యద్ బాషా



పీలేరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల కో-ఆప్షన్ సభ్యుడిగా వైసీపీ నేత షేక్ సయ్యద్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరిగిన ఎన్నికల్లో ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడం తో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆయన తండ్రి రెడ్డిబాషా కో-ఆప్షన్ సభ్యుడిగా ఉంటూ మరణించడంతో అధిష్ఠానం సయ్యద్ బాషా ను అభ్యర్థిగా ఎంపిక చేసింది. రిటర్నింగ్ అధి కారి అమరనాథరెడ్డి, ఎంపీడీఓ శివశంకర్, ఎంపీపీ సతీశ్ రెడ్డి సమక్షంలో ఎన్నిక ధృవీకరణ పత్రం అందుకున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గుర్రంకొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని ఎస్ఐ మధురామచంద్రుడు అన్నారు. తెలుగు జడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు ‘మహిళా సాధికారిత’అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. హెచ్ఎం మదన్‌మోహన్, ఉపాధ్యాయులు త్రినాథ్‌రావు, హర్షవర్ధన్‌రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట : టీడీపీ

ములకలచెరువు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ పేర్కొన్నారు. దేవళచెరువులో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాలతో గురువారం కుటుంబ సాధికార సారధుల ఎంపికకు నేతలు, కార్యకర్తల సమావేశం జరిగింది. మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నేతలు కేశవరెడ్డి, రషీద్, శ్రీనివాసులు, భాస్కర్‌నాయుడు, రామదాసు, అర్జున పాల్గొన్నారు.

కౌలు రైతుల కోసం కొత్త చట్టం తీసుకురావాలి

- రైతు సేవా కేంద్రం వద్ద రైతు సంఘం ధర్నా


వినతి పత్రం అందజేస్తున్న నేతలు

ములకలచెరువు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల సంక్షేమం, రక్షణ కోసం సమగ్ర నూతన కౌలు చట్టాన్ని అమలు చేయాలని రైతు సంఘం నియోజకవర్గ నేత అంజనప్ప డిమాండ్ చేశారు. స్థానిక రైతు సేవా కేంద్రం ఎదుట రైతు సంఘ నేతలు చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ గ్రామ సభల్లో భూ యజమాల ప్రమేయం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. అనంతరం సమస్యల వినతి పత్రం సిబ్బందికి అందజేశారు.

ఉపాధి ఇంజనీర్‌గా మహేష్ బాబు

తంబళ్లపల్లె, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ఉపాధి పథకం మండల ఇంజనీరుగా మహేష్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న రామన్న గాలివీడుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో పీటీఎం మండలంలో పనిచేస్తున్న మహేష్‌బాబు వచ్చారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల నిర్వహణలో మెరుగైన సేవలు అందించడం, ఉపాధి కూలీల సంఖ్య పెంచడానికి కృషి చేస్తానన్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సునీల్ వరకుమార్

మదనపల్లె అర్బన్/మదనపల్లె టౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి):క్రైస్తవ బోధకుడు, పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి పై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని మదనపల్లె క్రైస్తవ ఐక్యవేదిక, గ్లోరీ పాస్టర్స్ అసోసియేషన్ వేర్వేరుగా డిమాం డ్ చేసింది. గురువారం సీఎస్ఐ జేసీఎం కమ్యూనిటీ హా ల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎస్ఐ చర్చి చైర్మన్ రెవరెండ్ డాక్టర్ సునీల్ వరకుమార్ మాట్లాడుతూ పాస్ట ర్ ప్రవీణ్ మృతిపై ఎన్నో అనుమానాలున్నాయని సమగ్ర విచారణ చేయాలని, వారి కుటుంబసభ్యులను ఆదుకోవాలని కోరారు. ఇంతటి ఘాతకానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పగడాల ప్రవీణ్, మృతిపై సమగ్ర విచారణ చేపట్టాని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు విలేక రులతో మాట్లాడారు.

గ్లోరీ పాస్టర్స్ అసోసియేషన్

పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానాలను నివృత్తి చేసేందుకు ప్రభుత్వం న్యాయ విచారణ చేయించాలని గ్లోరీ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాన్‌బాబు డిమాండ్ చేశారు. ఎస్‌బీఐ కాలనీలోని పీటర్‌రాక్ చర్చిలో పలువురు చర్చి పాస్టర్లు సమావేశమయ్యారు. ప్రవీణ్ మృతి కేసును ప్రత్యేక పోలీసు బృందంతో విచారణ వేగవం తం చేయాలన్నారు. క్రైస్తవులపై దాడులు జరగకుండా ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం వుందన్నారు. పాస్టర్లు సుందర్‌సింగ్, జీవరత్నం, ఎం.పాల్, శామ్యూల్, సాలోమన్, దివాకర్, కృష్ణప్ప, ప్రమీలమ్మ, నిర్మల, సుకన్య పాల్గొన్నారు.